# క్రైమ్ మిర్రర్

Voice of Anti Corruption

15 ANNIVERSARY


హైదరాబాద్
27-4-2025
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:15
సంచిక: 25

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


# రజతోత్సవ సభ వేళ
# కాళేశ్వరం రచ్చ



## బీఆర్ఎస్ ను వీడని కాళేశ్వరం ఎత్తిపోతల.
## ఎన్ డీ ఎస్ ఏ నివేదికతో జోరుగా చర్చలు...



**ఉపయోగించడానికి వీల్లేదన్న నిపుణులు.**

**నాడు ప్రపంచ అద్భుతంగా ప్రచారాలు.**

**మేడిగడ్డతో పాటే... బీఆర్ఎస్ కుంగుబాటు.**

**గత అసెంబ్లీ ఎన్నికల్లో స్పష్టమైన ప్రభావం.**

**27 న ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ భారీ సభ.**

**అందులో కేసీఆర్ మరోసారి స్పందించే నా.. ?**

**జస్టిస్ ఘోష్ కమీషన్ విచారిస్తుందా.. ?**

**రాజకీయంగా ఆసక్తి రేపిన నివేదిక**

2లో

బీఆర్ఎస్ అధికారంలో ఉండగా సమయం, సందర్భం ఏదైనా కేసీఆర్ సహా ఆ పార్టీ నాయకులెవరి నోట విన్నా కాళేశ్వరం గొప్పదనం గురించిన మాటే వినిపించేది. అధికారంలో ఉండగా పొగడ్తల రూపంలో కనిపించిన కాళేశ్వరం... ఇప్పుడు విమర్శల రూపంలో వారిని వెంటాడుతుంది. ఎన్నికలు... ఆ తర్వాత ఫలితాలు రాజకీయ విమర్శల్లో కాళేశ్వరం కాస్త " కూలే " శ్వరంగా మారిపోయింది. తాజాగా మరోసారి కాళేశ్వరం అంశం తెరపైకి వచ్చింది.

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో :** రామేశ్వరం పోయిన శనేశ్వరం పోలేదన్నట్లు కేసీఆర్, బీఆర్ఎస్ విషయంలో కాళేశ్వరం నీలి నీడలు నిత్యం ఏదో రూపంలో వెంటాడుతున్నాయి. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా అండ పిండ బ్రహ్మాండమంటూ పొందే పదే పొగడ్తలు వర్షం కురిపించారు. ఈ భూమ్మీద కాళేశ్వరం లాంటి ప్రాజెక్ట్ ఇప్పటివరకు మరొకటి లేదు... కట్టిన వారు లేరు... కట్టబోయే వారు లేరు... అంటూ అంతర్జాతీయ ప్రచారం చేసుకున్నారు. అది నిజమేననే చర్చ గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు వరకు ఉండేది. కానీ ఇక్కడ సీన్ రివర్స్ అయింది. సరిగ్గా ఎన్నికలకు కొద్ది రోజుల ముందు మేడిగడ్డ పిల్లర్ కుంగిపోయింది. అది బీఆర్ఎస్ కు శాపంగా మారింది. చివరకు బీఆర్ఎస్ కు కుంగుబాటుగా పరిణమించింది. మేడిగడ్డ కొంగుబాటును బీఆర్ఎస్ పాపంగా కాంగ్రెస్ పార్టీ అభివర్ణిస్తుంది. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా సమయం, సందర్భం ఏదైనా కేసీఆర్ సహా ఆ పార్టీ నాయకులెవరి నోట విన్నా కాళేశ్వరం గొప్పదనం గురించిన మాటే వినిపించేది. అధికారంలో ఉండగా పొగడ్తల రూపంలో కనిపించిన కాళేశ్వరం... ఇప్పుడు విమర్శల రూపంలో వారిని వెంటాడుతుంది. ఎన్నికలు...

2లో




## అన్ని వర్గాల ఆకాంక్షలు
# నెరవేర్చేలా పాలన

**రికార్డు స్థాయిలో 20వేల కోట్లతో రైతు రుణమాఫీ**

**నిరుద్యోగ యువత కోసం రాజీవ్ యువవికాసం**

**పెట్టుబడులను ఆకర్షించేలా కార్యక్రమాలు**

**భారత్ సమ్మిట్ ముగింపు సమావేశంలో సిఎం రేవంత్**

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** సమాజంలోని అన్ని వర్గాల ఆకాంక్షలు నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. దీనికోసం అనేక పథకాలను తీసుకొచ్చామని అన్నారు. దేశంలోనే అతిపెద్ద రైతు రుణమాఫీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, ఇప్పటికే రూ.20 వేల కోట్లు రుణమాఫీ చేశామని చెప్పారు.

- మిగతా 2వ పేజీలో

# పహల్గామ్ దాడిపై నిష్పాక్షిక విచారణ జరగాలి

**తటస్థ విచారణకు తాము సహకరిస్తాం**

**భారత్ నుంచి ఎలాంటి సవాల్‌నైనా ఎదుర్కొంటాం**

**సింధూజలాల నిలిపివేత ఏకపక్ష నిర్ణయం**

**పాక్ ప్రధాని షహబాజ్ షరీఫ్ ప్రకటన**

**ఇస్లామాబాద్, (క్రైమ్ మిర్రర్):** జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి నేపథ్యంలో భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి.




# ఎల్కతుర్తిలో నేడు బహిరంగ సభ

**కేసీఆర్ సహా హాజరుకానున్న పార్టీ నేతలు**

**పునరుత్తేజమే లక్ష్యంగా దిశానిర్దేశం చేయనున్న భారాస అధినేత**

**ఎల్కతుర్తి కూడలిలో కేసీఆర్ భారీ కటౌట్**



# సీతారామ ప్రాజెక్టుకు కేంద్రం అనుమతి

**తెలంగాణ చరిత్రలో కీలక అభివృద్ధి.. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి**

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** సీతారామ ఎత్తిపోతల పథకం, సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టుకు కేంద్ర జలవనరుల శాఖ అనుమతి ఇచ్చిందని.. ఇది తెలంగాణ ఇరిగేషన్ చరిత్రలో

# టీడీపీకి వెనుకబడిన వర్గాలే వెన్నెముక

**మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు తీసుకొస్తా**

**మత్స్యకారుల సేవలో' పథకాన్ని ప్రారంభించిన చంద్రబాబు**



2లో

# మద్యం దందా.. జగన్‌దే అంతా!

సజ్జల శ్రీధర్‌రెడ్డి రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు

సిండికేట్‌లో నాటి ముఖ్యమంత్రే ప్రధాన భాగస్వామి

ఆయన ఆదేశాలతోనే అరబిందో ద్వారా ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్‌కు రూ.45 కోట్ల రుణం

సిండికేట్‌కు లంచాలు ఇవ్వాలనేది షరతు

ఎస్పీవైలో డైరెక్టర్‌గా ఉన్నంతకాలం చెల్లించానన్న సజ్జల శ్రీధర్‌రెడ్డి

సిట్ దర్యాప్తులో వెలుగులోకి..






# రజతోత్సవ సభ వేళ కాళేశ్వరం రచ్చ



(మొదటి పేజీ తరువాయి)

ఆ తర్వాత ఫలితాలు రాజకీయ విమర్శల్లో కాళేశ్వరం కాస్త " కూలే " శ్వరంగా మారిపోయింది. తాజాగా మరోసారి కాళేశ్వరం అంశం తెరపైకి వచ్చింది. కాళేశ్వరం పరిస్థితి, ప్రత్యామ్నాయ చర్యలపై ఎన్ డీ ఎస్ ఏ తుది నివేదిక గత డిసెంబర్ నాటికే సమర్పించాల్సి ఉంది. కాగా జాతీయ అనంతరం గురువారం రాత్రి సమర్పించడం తో ఇప్పుడు అది బలమైన ఎజెండాగా ముందుకు వచ్చింది.

**కాళేశ్వరం విఫల ప్రాజెక్టు ! ఎన్ డీ ఎస్ ఏ నివేదిక !**

కాళేశ్వరం లో భాగంగా కట్టిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులు ఉపయోగపడని, ఒకవేళ ఉపయోగిస్తే ఎప్పుడైనా కొట్టుకుపోవచ్చునేది నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ( ఎన్ డీ ఎస్ ఏ ) నివేదిక సారాంశం. వీటిని మళ్లీ రీ డిజైన్ చేసి, మళ్లీ నిర్మించాలని ఎన్ డీ ఎస్ ఏ సిఫారసు చేసింది. నిర్మాణం, డిజైన్ లో అన్నీ లోపాలే అని స్పష్టం చేసింది. మూడు బ్యారేజీల లోనూ సికెంట్ పైల్స్ కూలిపోవడం, బ్యారేజ్ ఎగువ దిగువ ల్లో రంధ్రాలు గుర్తించారు. పలు పరీక్షలు చేసి 14 నెలల అధ్యయనం మీదట ఎన్ డీ ఎస్ ఏ ఈ రిపోర్ట్ ఇచ్చింది. బ్యారేజీల నిర్మాణానికి చేయాల్సిన భూసార పరీక్షలు కూడా చేయలేదని ఎన్ డి ఎస్ ఏ గుర్తించింది. అన్నారం సుందిళ్ల బ్యారేజీ లను ఒకచోట ప్రతిపాదించి, మరో చోటికి మార్చారని స్పష్టం చేసింది. జాతీయ ఆనకట్టల భద్రతా చట్టం 2021 ప్రకారం వానా కాలానికి ముందు తర్వాత బ్యారేజీలు ఏ విధంగా ఉన్నాయనేది పరిశీలించాలి. కానీ అలాంటి ప్రయత్నం చేయలేదని రిపోర్టు స్పష్టం చేసింది. ఎన్ డీ ఎస్ ఏ రిపోర్టులో నిర్మాణం, నిర్వహణ, డిజైన్ లోపాలే మూడు బ్యారేజీలకు ముప్పు తెచ్చాయని తేల్చేయడంతో రాజకీయంగాను కలకలం రేపే అవకాశాలు ఉన్నాయి.

**రజతోత్సవ సభ వేళ రాజకీయ రచ్చ !**

కాళేశ్వరం ప్రాజెక్టు పై ఎన్ డి ఎస్ ఏ నివేదిక వచ్చిన నేపథ్యంలో ఇదే సమయంలో నేడు ఎల్కతుర్తి లో బీఆర్ఎస్ రజతోత్సవ సభను భారీ స్థాయిలో నిర్వహించేందుకు సిద్ధమవుతున్నది. సభ నిర్వహిస్తున్న సందర్భం కావడంతో కాలేశ్వరం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఇప్పటివరకు అధికార పార్టీ నేతలు విమర్శలు, ఎన్ డి ఎస్ ఏ నివేదికపై ఎల్కతుర్తి సభా వేదికగా బీఆర్ఎస్ అధినేత, కాళేశ్వరం నిర్మాత కేసీఆర్ ఏ విధంగా ప్రతిస్పందిస్తారనేది సర్వత్రా ఉత్కంఠగా మారింది.

## ఘోష్ కమిషన్ కు ఈ నివేదిక కీలకం !

కాళేశ్వరం అక్రమాలపై విచారణ జరుగుతున్న జస్టిస్ ఘోష్ కమీషన్ కు ఈ నివేదికే అత్యంత కీలకం కానుంది. ఇప్పటికే పలుమార్లు జస్టిస్ ఘోష్ కమిషన్ విచారణ జరిపింది. ఫైనల్ గా కేసీఆర్, హరీష్ రావు, ఈటల రాజేందర్ ను కూడా ప్రశ్నించే అవకాశం ఉందని ప్రచారం జరుగుతుంది. ఇలాంటి సమయంలో ఎన్డీఎస్ ఎ రిపోర్టర్ రావడం బీఆర్ఎస్ కు షాక్ లాంటిదే అనే అభిప్రాయాలు రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. అయితే ఇప్పుడు సామాన్య ప్రజలు, పాలక పార్టీ నుంచి వచ్చే విమర్శలకు బీఆర్ఎస్ సమాధానం చెప్పుకోవాల్సి ఉంటుంది.



## అన్ని వర్గాల ఆకాంక్షలు

# నెరవేర్చేలా పాలన

హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహించిన భారత్ సమ్మిట్‌లో పాల్గొని ఆయన మాట్లాడారు. రైతు భరోసా కింద ఎకరాకు రూ.12 వేలు ఇస్తున్నాం. వరికి మద్దతు ధరతో పాటు- రూ.500 బోనస్ ఇస్తున్నాం. పట్టభద్రులు సర్టిఫికెట్ తీసుకుంటున్నారు. కానీ ఉద్యోగాలు లేవు. యువత కోసం రాజీవ్ యువ వికాసం పథకం తీసుకొచ్చాం. ప్రజలకు ఏ సమయంలో ఏది అవసరమో కాంగ్రెస్‌కు బాగా తెలుసని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమ్మిట్‌కు పలువురు మంత్రులు, కాంగ్రెస్ నేతల, విదేశీ ప్రతినిధులు హాజయ్యారు. వివిధ అంశాలపై చర్చలు కొనసాగుతున్నాయి. బహుళత్వం- వైవిధ్యం, పోలరైజేషన్‌ను అధిగమించడం, వేగవంతమైన న్యాయం, అనిశ్చితికాలంలో ఆర్థిక న్యాయం, ప్రపంచ శాంతి, న్యాయంపై చర్చలు జరుగుతున్నాయి. హెచ్ఐసీసీలో భారత్ సమ్మిట్ ముగింపు సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ సమ్మిట్ లో మాట్లాడటం ఎంతో ఆనందంగా ఉంది.. తెలంగాణకు ఎంతో ఘన చరిత్ర ఉందన్నారు.. అయితే, గత పదేళ్లలో ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదు.. అందుకే కాంగ్రెస్ పాలన మీద ప్రజలు ఎక్కువ నమ్మకాన్ని పెట్టు-కున్నారని తెలిపారు. ఇక, రూ. 20 వేల కోట్లు- రైతులకు రుణమాఫీ చేశాం.. దేశంలోనే ఇది పెద్ద నిర్ణయం.. రైతు భరోసా పేరుతో రూ. 12000 ఎకరాకు ఇస్తున్నాం.. ఉపాధి హామీ కార్డు దారులకు సాయం చేస్తున్నాం.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సమాజంలోని ప్రతి ఒక్కరి ఆకాంక్షలు నెరవేర్చడమే మా ప్రభుత్వ లక్ష్యం అని ఆయన పేర్కొన్నారు. భారత దేశ చరిత్రలోనే అతి పెద్ద సంక్షేమ పథకాలను తెలంగాణలో అమలు చేస్తున్నాం.. లక్షల మంది రైతులను రుణ విముక్తుల్ని చేశామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

అలాగే, రైతులు మద్దతు ధర కోసం గతంలో ఆందోళనలు చేసేవారు అని సీఎం రేవంత్ పేర్కొన్నారు. కానీ, మేం అధికారంలోకి వచ్చిన తర్వాత మద్దతు ధరతో పాటు- ధాన్యానికి క్వింటాకు రూ. 500 బోనస్ ఇస్తున్నాం.. ఇక, ప్రత్యేక తెలంగాణ కోసం జరిగిన ఉద్యమంలో విద్యార్థులది కీలక పాత్ర పోషించారని చెప్పుకొచ్చారు. కానీ, వారికి ఎలాంటి ప్రయోజనం చేకూరలేదన్నారు. తొలి ఏడాదిలోనే 60 వేలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేశాం.. 5 లక్షల యువతకు రాజీవ్ యువ వికాసం అమలు చేస్తున్నాం.. ప్రజల ఆకాంక్షలు అర్థం చేసుకుని దాని ప్రకారం ముందుకెళ్లడం కాంగ్రెస్ పార్టీ విధానం అని రేవంత్ రెడ్డి వెల్లడించారు.

తెలంగాణలో స్కిల్ యూనివర్సిటీ- ఏర్పాటు- చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో పెట్టుబడులను ఆహ్వానించాం.. దావోస్ నుంచి లక్ష కోట్ల పెట్టు-బడులు తెచ్చాం.. మహిళలను కోటీ-శ్వరులను చేయడమే మా అజెండాగా పెట్టు-కున్నాం.. మహిళా పారిశ్రామిక వేత్తలను బడా పారిశ్రామిక వేత్తలుగా చేయాలని ఆలోచనతో ముందుకెళ్తున్నాం..ఆర్టీసీలో మహిళలు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నాం.. రాజీవ్ ఆరోగ్య శ్రీ 10 లక్షల వరకు పరిధి పెంచాం.. ఏడాదిలో రూ. 1000 కోట్లు- ఖర్చు చేశాం.. మూసి నదిని పునరుజ్జీవం చేసేందుకు కృషి చేస్తున్నాం.. మూసి పెద్ద ఎట్రాక్షన్ కాబోతుందని ముఖ్యమంత్రి రేవంత్ అన్నారు.

## మద్యం దందా.. జగన్‌దే అంతా!

(మొదటి పేజీ తరువాయి)



అమరావతి: వైద్య పరీక్షల అనంతరం సజ్జల శ్రీధర్‌రెడ్డిని విజయవాడలోని ఏసీబీ కోర్టుకు తరలిస్తున్న పోలీసులు వైకాపా హయాంలో రూ.వేల కోట్ల విలువైన మద్యం కుంభకోణానికి పాల్పడ్డ సిండికేట్‌లో నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాన భాగస్వామి అని సిట్ దర్యాప్తులో తేలింది. నంద్యాలలోని ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్ (డిస్టిలరీ) వ్యాపార పునరుద్ధరణ, అభివృద్ధి కోసం ఆ సంస్థకు అరబిందో గ్రూపు ద్వారా రూ.45 కోట్లు రుణమిప్పించిందీ జగనేనని వెల్లడైంది. 12 శాతం వడ్డీతో రుణం తిరిగి చెల్లించటంతో పాటు మద్యం సిండికేట్‌లో భాగస్వాములైన జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, రాజ్ కెసిరెడ్డి, నాటి సీఎంవో కార్యదర్శి ధనుంజయరెడ్డి, ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డిలకు నగదు రూపంలో ముడుపులు చెల్లించాలనే ఒప్పందంతో ఈ రుణం ఇప్పించినట్లు నిర్ధారణైంది. అరబిందో గ్రూపునకు ఆ అప్పు తిరిగి చెల్లించేందుకు ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్ ఖాతా నుంచి డీకార్ట్ లాజిస్టిక్స్, సన్‌హౌక్ ల్యాబ్స్ ఖాతాల్లోకి ప్రతి నెలా రూ.కోటి చొప్పున రూటింగ్ చేసినట్లు స్పష్టమైంది. ఇదే కాకుండా ఒప్పందం మేరకు మద్యం సిండికేట్‌కు కూడా ఎప్పటికప్పుడు ముడుపులు అందజేసినట్లు తేలింది. మద్యం కుంభకోణం కేసులో ఆరో నిందితుడి (ఏ6)గా ఉన్న ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్ నాటి డైరెక్టర్ సజ్జల శ్రీధర్‌రెడ్డే తమ విచారణలో ఈ విషయాలన్నీ వెల్లడించారని సిట్ పేర్కొంది. మద్యం కుంభకోణం కేసులో శ్రీధర్‌రెడ్డిని శుక్రవారం అరెస్టు చేసిన సిట్ అధికారులు.. శనివారం మధ్యాహ్నం విజయవాడలోని ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. ఆయనకు మే 6 వరకు జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ న్యాయాధికారి ఆదేశాలిచ్చారు.

# టీడీపీకి వెనుకబడిన వర్గాలే వెన్నెముక

**శ్రీకాకుళం,(క్రైమ్ మిర్రర్):** టీడీపీకి వెనుకబడిన వర్గాలే వెన్నెముక అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. స్థానికుల సమస్యలు, పేదల కష్టాలు చూశానని.. కొందరు జాలర్ల ఆదాయం కూడా కాజేస్తున్నారని తెలిపారు. మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు తీసుకొస్తామని స్పష్టం చేశారు. ఎన్ని ఇబ్బందులున్నా మత్స్యకారుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా 'మత్స్యకారుల సేవలో' పథకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో వెనకబడిన వర్గాలన్నీ కూటమికి అండగా నిలిచాయని.. వెనుకబడిన వర్గాల కోసం మరిన్ని కార్యక్రమాలు తీసుకొస్తామని సీఎం వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో రూ.10 లక్షల కోట్ల అప్పులు చేశారని.. వైసీపీ హయాంలో తీసుకొచ్చిన రుణాలు ఏం చేశారో కూడా లెక్కలు లేవని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చాకే జాలర్ల దశదిశ మారిందన్నారు. వేట విరామ సమయంలో జాలర్లకు ఆర్థిక సాయం చేస్తున్నామన్నారు. మత్స్యకార కుటు-ంబాలకు రూ.20 వేల చొప్పున సాయం అందిస్తున్నామని తెలిపారు. పథకం కింద 1,29,178 కుటు-ంబాలకు రూ.259 కోట్ల లబ్ధి చేకూరుతోందని చెప్పారు. 'గత నాయకుల మాదిరిగా మేము కూడా బటన్ నొక్కొచ్చు కానీ.. నేరుగా మీ దగ్గరికే వచ్చాం.. మీ సమస్యలు తెలుసుకున్నాం. మీ కష్టాలు తెలుసుకుని నేరుగా పథకాలు అందిస్తున్నాం' అని తెలిపారు. అన్ని మత్స్యకార గ్రామాలను బాగుచేస్తామని తెలిపారు. ప్రభుత్వం బాధ్యతగా ఉండాలని.. ప్రజల ఆదాయం పెంచాలన్నారు. ప్రజల జీవన ప్రమాణాలను ప్రభుత్వం మెరుగుపరిచాలన్నారు. గతంలో నేతలు వస్తే చెట్టు-నరికేయడం.. పరదాలు కట్టడం జరిగేవని విమర్శించారు. గతంలో ఉద్దానం ప్రాంతానికి ఎర్రన్నాయుడు నీళ్లు సాధించారని గుర్తుచేశారు. ఇప్పుడు రామ్మోహన్ ఆధ్వర్యంలో భోగాపురం ఎయిర్‌పోర్టు పూర్తికాబోతోందన్నారు. మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు రావాలన్నారు. 9 షిప్పింగ్ హార్బర్ల నిర్మాణం చేపడుతున్నామని..ఏడాదిలోగా షిప్పింగ్ హార్బర్ల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. దేశంలో ఉత్పత్తయ్యే మత్స్య సంపదలో ఏపీ నుంచే 29శాతం అని చెప్పుకొచ్చారు. మత్స్యకారుల పిల్లలను బాగా చదివించే బాధ్యత తీసుకుంటామన్నారు. ఇప్పటికే 6 రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు-చేశామని..అవకాశాలను ఉపయోగించుకుని ముందుకు సాగాలని అన్నారు. ఎచ్చెర్లలో నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటు- చేస్తామని తెలిపారు. స్థానికులకే ఉద్యోగాలు వచ్చేలా చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. మా కంటే చిన్న వయస్సులో ఉన్నవారిలా చంద్రబాబు అహర్నిశలు పనిచేస్తున్నారు. వేట నిషేధ భృతి పెంచుతానని హామీ ఇచ్చి మాట నిలబెట్టు-కున్నారు. జీవో 217 కూడా రద్దు చేసి మత్స్యకారుల హక్కులు కాపాడారు. వెనుకబడిన జిల్లా అంటూ విని విని విని బాధపడుతూ వచ్చా .. శ్రీకాకుళం సెట్ ఇవ్వాలంటే.. మన మైండ్ సెట్ మారాలి. సుదీర్ఘ తీర ప్రాంతంలో ఒక్క పోర్ట్ లేకపోయింది. పోర్ట్‌తో పాటు- ఎయిర్ పోర్ట్ కూడా నిర్మిస్తాం. కేంద్రంతో మాట్లాడి జెట్టీలు, హార్బర్‌లు నిర్మిస్తాం. ఏం తక్కువ మన జిల్లాకు. అన్ని వనరులు ఉన్నాయి. యువత ఉపయోగించుకోవాలి.. సహకారం అందిస్తాం' అని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు వెల్లడించారు. కాగా.. మత్స్యకారుల సేవలో పథకం ద్వారా మత్స్యకార కుటు-ంబాలకు రూ.20 వేల చొప్పున సాయం అందిచనున్నారు. సముద్రంలో వేట విరామ సమయంలో ఆర్థిక సాయం అందించనున్నారు.

# పహల్గామ్ దాడిపై నిష్పాక్షిక విచారణ జరగాలి

ఈ క్రమంలోనే న్యూదిల్లీ తీసుకున్న పలు నిర్ణయాలపై పొరుగుదేశంలోని పలువురు మంత్రులు అక్కసు వెళ్లగక్కారు. ఈ పరిణామాలపై పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తాజాగా మౌనం వీడారు. పహల్గాం దాడి పై తటస్థ దర్యాప్తునకు తాము సిద్ధమేనని ప్రకటించారు. అలాగే ఎలాంటి ముప్పునైనా ఎదుర్కొంటామంటూ వ్యాఖ్యానించారు. ఖైబర్ పఖ్తుంఖ్వాలోని పాకిస్తాన్ మిలిటరీ అకాడమీ గ్రాడ్యుయేషన్ వేడుకల్లో పాల్గొన్న షెహబాజ్ షరీఫ్.. ఉద్రిక్తతల గురించి స్పందించారు. పహల్గాంలో ఇటీవల జరిగిన విషాదకర ఘటనతో మరోసారి మన దేశం నిందలు ఎదుర్కొంటోంది. ఆ ఘటనపై తటస్థ, పారదర్శక, విశ్వసనీయ దర్యాప్తులో పాల్గొనేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. శాంతికే మా ప్రాధాన్యం అని షరీఫ్ తెలిపారు. ఉగ్రవాదాన్ని తాము కూడా ఖండిస్తామంటూ శాంతి వచనాలు వల్లె వేశారు. ఈసందర్భంగా ఉగ్రవాదాన్ని సమూలంగా నాశనం చేస్తామంటూ ఇటీవల భారత

ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై షరీఫ్ పరోక్షంగా స్పందించారు. మా దేశ భద్రత, సార్వభౌమత్వంపై ఎన్నటికీ రాజీపడబోం. ఎలాంటి ముప్పును ఎదుర్కోడానికైనా సంసిద్ధంగా ఉన్నాం అని తెలిపారు. అనంతరం సింధూ జలాల ఒప్పందం నిలిపివేత అంశాన్ని ప్రస్తావిస్తూ.. భారత్ ఇలా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం తగదు. ఈ చర్యతో యుద్ధ వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని మేం కోరుకుంటున్నాం అంటూ భారత్‌ను నిందించే ప్రయత్నం చేశారు.ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. దీని వెనక పాక్ కేంద్రంగా పనిచేస్తోన్న లష్కరే తోయిబా అనుబంధ సంస్థ 'ది రెసిస్టెన్స్ ఫోర్స్' హస్తం ఉన్నట్లు- భద్రతా బలగాలు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తోన్న పాకిస్థాన్‌కు భారత్ గట్టి షాకిచ్చింది. సింధూ జలాల ఒప్పందం నిలిపివేతతో పాటు పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. పాక్ పౌరులు తక్షణమే దేశం విడిచి వెళ్లిపోవాలని ఆదేశించింది. అటు పాక్ కూడా ప్రతిచర్యలు చేపట్టింది. భారత విమానాలకు తమ గగనతలాన్ని మూసివేస్తున్నట్లు- ప్రకటించింది. జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి నేపథ్యంలో భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. ఈ క్రమంలోనే భారత పాలకులు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ పరిణామాలపై పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తాజాగా మాట్లాడారు.

# ఎల్కతుర్తిలో నేడు బహిరంగ సభ

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా 2001లో ఆవిర్భవించి.. 13 ఏళ్లు ఉద్యమ పార్టీగా.. తొమ్మిదిన్నరేళ్లు అధికార పార్టీగా.. ప్రస్తుతం ప్రతిపక్ష పార్టీగా భిన్నపాత్రలు పోషిస్తున్న భారత రాష్ట్ర సమితి (భారాస) రజతోత్సవ సంబరానికి సిద్ధమైంది. తెలంగాణ రాష్ట్ర సమితి (తెరాస)గా మొగ్గ తొడిగిన పార్టీ.. 2014లో ప్రత్యేక రాష్ట్రం ఏర్పడగానే తొలి ప్రభుత్వంగా అధికారంలోకి వచ్చింది. ఎనిమిదేళ్ల తర్వాత జాతీయస్థాయిలో విస్తరించాలనే లక్ష్యంతో 2022లో 'భారాస'గా రూపాంతరం చెంది.. ఇప్పుడు రజతోత్సవ సభ ద్వారా తిరిగి సత్తా చాటేందుకు సన్నద్ధమైంది. పార్టీ అధినేత కేసీఆర్ ఆదివారం సాయంత్రం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే భారీ బహిరంగసభలో ప్రసంగించడం ద్వారా కార్యకర్తలను తిరిగి కార్యోన్ముఖులను చేయనున్నారు. గులాబీ దళం ఈ సభను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని విజయవంతం చేసే దిశగా పనిచేస్తోంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వరుసగా రెండు దఫాలు విజయాలతో అధికారం చేపట్టి.. మూడోసారి ఓటమి చెందిన భారాస.. మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది. ప్రతిపక్ష పాత్రలో భాగంగా.. ముఖ్యనాయకులు ప్రభుత్వంపై పోరాటంలో చురుగ్గా పాల్గొంటూ ప్రజలకు దగ్గరయ్యేందుకు నిరంతరం ప్రయత్నిస్తున్నారు. రజతోత్సవ బహిరంగసభ భారాస మళ్లీ తన వైభవాన్ని పొందడానికి ఓ మైలురాయి కాగలదని పార్టీ నేతలు ఆశిస్తున్నారు.

## సీతారామ ప్రాజెక్టుకు కేంద్రం అనుమతి

లాండ్ మార్క్ డెవలప్‌మెంట్ అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం నాడు మీడియాతో మంత్రి మాట్లాడుతూ.. ఏడాదిన్నర కృషి ఫలించిందన్నారు. ఇరిగేషన్ శాఖలో ఇది ముందడుగని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులు చాలా కాలంగా గోదావరి జలాల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. గోదావరి నదీ జలాలలో 68 టీఎంసీలు.. 8 లక్షల ఎకరాలకు ఉపయోగమని చెప్పుకొచ్చారు. గత ప్రభుత్వంలో మేడిగడ్డ కూలిపోయిందని..సీతమ్మ సాగర్ నిలబడుతుందా అని కేంద్రం అడిగిందన్నారు. సీడబ్ల్యూసీకి అన్ని వివరాలు పంపితే అప్పుడు అప్రూవల్ ఇచ్చారని వెల్లడించారు. పోలవరం బ్యాక్ వాటర్ విషయంలో తెలంగాణకు అన్యాయం జరుగుతోందన్నారు. ముంపు నష్టం.. ప్రొ-టెక్షన్ వాల్ కోసం కేంద్రం నిధులు ఇవ్వాలని అడిగామని.. అందుకు కేంద్రం కొంత అనుకూలంగా ఉందని తెలిపారు. కృష్ణా జలాల వాటాలో తెలంగాణ రైతులకు బీఆర్ఎస్ ద్రోహం చేసిందని విమర్శించారు. తెలంగాణకు ఎక్కువ భాగం ఇవ్వాలని ట్రిబ్యునల్ ముందు వాదిస్తున్నామన్నారు. అంతరాష్ట్ర సమస్యలపై ప్రభుత్వం సీరియస్‌గా వర్కౌట్ చేస్తోందన్నారు. ఎన్‌డీఎస్ఏ నివేదికపై బీఆర్ఎస్ మాట్లాడే తీరు ఖండిస్తున్నామన్నారు. తుమ్మిడిహెట్టి దగ్గర తాము ప్రాజెక్ట్ మొదలుపెట్టామని.. బీఆర్ఎస్ తమకు పేరు వస్తుందని రీడిజైన్ చేసి... లక్షన్నర కోట్లకు పెంచారని అన్నారు. కాళేశ్వరం కట్టిన డబ్బు బీఆర్ఎస్ వాళ్ళ జేబులో నుంచి కట్టలేదన్నారు. తెలంగాణ ప్రజల భవిష్యత్ తాకట్టు- పెట్టి మరీ కట్టారని మండిపడ్డారు.

# నాపై దాడి చేసిన వారిని వదిలేది లేదు..

**దాడికి అదే కారణం కావొచ్చు**

**చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్**

**దాడి చేసిన వారిపై న్యాయపోరాటం చేస్తానన్న రంగరాజన్**

**ఫిబ్రవరి 7న తన నివాసంలోకి వచ్చి దాడి చేశారని వెల్లడి**

**దీని వెనుక ఎంతటి వారున్నా వదిలేది లేదని వ్యాఖ్య**

చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్ తనపై రెండు నెలల క్రితం జరిగిన దాడి ఘటనపై తీవ్రంగా స్పందించారు. దాడి చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని, వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.దాడి ఘటన వివరాలను రంగరాజన్ వివరిస్తూ, "ఫిబ్రవరి 7వ తేదీన కొందరు వ్యక్తులు మా ఇంటికి వచ్చి తలుపులు తట్టారు. అప్పుడు నేను స్నానం చేయనందున టీషర్టులో ఉన్నాను, ఇప్పుడు ఎవరినీ కలవలేనని చెప్పాను" అని తెలిపారు. వారిలో నల్ల బట్టలు ధరించిన ఒక వ్యక్తి, 'రామరాజ్యం కోసం పనిచేసే వారిని కలవడానికి మీకు సమయం లేదా?' అంటూ 'టేక్ హిమ్ కస్టడీ' అని అన్నట్లు రంగరాజన్ గుర్తుచేసుకున్నారు. ఆ వ్యక్తి మాటలు విని ఎవరో పెద్ద అధికారి అయి ఉంటారని తాను భావించినట్లు చెప్పారు.అనంతరం, సుమారు 20 మంది వ్యక్తులు ఒక్కసారిగా తలుపులు తోసుకుని ఇంట్లోకి ప్రవేశించారని రంగరాజన్ ఆరోపించారు. "వారు నన్ను కాళ్లు పట్టి లాగి కిందపడేసి దాడి చేశారు. ఈ ఘటనతో నేను తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాను" అని ఆయన వివరించారు. ఈ దాడిని తేలిగ్గా తీసుకునేది లేదని, దీనిపై కచ్చితంగా న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు. దాడికి పాల్పడిన వారిపై సివిల్, క్రిమినల్ పరువు నష్టం దావాలు వేస్తామని తెలిపారు.

## శ్రీ శ్రీ శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయ కమిటీ సమావేశం..





మర్రిగూడ(క్రైమ్ మిర్రర్): మండలంలోని శివన్నగూడెం గ్రామంలోని శ్రీ శ్రీ శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయ నిర్మాణ కమిటీ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఆలయ నిర్మాణం, నిధుల సేకరణ, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించుకున్నారు. శివన్నగూడెం గ్రామంలో అపురూపంగా నిర్మాణం అవుతున్న ఈ ఆలయానికి వందల ఏండ్ల చరిత్ర కలిగినది. చుట్టు పక్క గ్రామాలకు సైతం ఈ ఆలయం ప్రసిద్ధిగాంచిన పురాతన ఆలయంగా కోరిన కోరికలు, జీవితంలో అభయం ఇచ్చే కోట్ల గూడెం ఆంజనేయ స్వామి ఆలయం చాలా ఏండ్ల నుండి నిర్మాణానికి నోచుకోలేదు. కొంతమంది శివన్నగూడ గ్రామానికి చెందిన పెద్దల నిర్ణయం మేరకు మరియు దేవాదాయ శాఖ వారి సహకారంతో నేడు ఆలయం రూపుదిద్దుకుంది. శివన్నగూడ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ప్రాజెక్ట్ కి అతి చేరువలో ఉన్న ఈ ఆలయం, భవిష్యత్తులో టూరిస్టులకు అభయంగా నిలువనుంది. ఇప్పటివరకు ఆలయ నిర్మాణానికి 50 లక్షల వరకు నిర్మాణం జరిగింది. పూర్తి నిర్మాణానికి కావాల్సిన నిధుల కోసం సేకరించే కార్యాచరణని ఆలయ ప్రాంగణంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ కన్వీనర్ మిడిమాలపు శ్రీనివాస్ రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు మారేపెల్లి గిరిధారచార్యులు, కో కన్వీనర్స్ దాసరి గోపాల్, మాకం చెన్న కేశవులు, మంచికంటి రాజు కమిటీ సభ్యులు మిడిమాలపు యాదగిరి రెడ్డి, మాకం గంగాధర్ నేత, మరియు గ్రామ పెద్దలు వంగాల రవీందర్ రెడ్డి, సంకబుద్ది రమేష్, మైల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం ముమ్మాటికీ ఎనిమిదో వింతే ?

## మూడేళ్లలోనే కట్టారు...మూడేళ్లలోనే కూలిపోయింది

### కెసిఆర్ ఎనిమిదో వింత మాటలు నిజమయ్యాయి: కోమటిరెడ్డి



**హైదరాబాద్,(క్రైమ్ మిర్రర్):** ప్రపంచంలో ఎనిమిదో వింత ఏదయినా ఉందంటే అది కాళేశ్వరమేననిమంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. మూడేళ్లలో ప్రాజెక్టను కట్టి దానిని మూడేళ్లలోనే కూలేట్టు చేసిన ఘనత మాజీ సిఎం కెసిఆర్‌దని అన్నారు. అందుకే ఇది ఎనిమిదో వింత అవుతుందని వ్యాఖ్యానించారు. ఎన్డీఎస్ఏ రిపోర్టు తాము బయట పెట్టలేదని.. వాళ్లే బయట పెట్టారని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. కాళేశ్వరం ఒక నాసిరకం ప్రాజెక్ట్ అని విమర్శించారు. శనివారంగాంధీభవన్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మీడియా సమావేశం మాట్లాడుతూ... కాళేశ్వరం తన మానస పుత్రిక అని మాజీ సీఎం కేసీఆర్ చెప్పారని గుర్తుచేశారు. కాళేశ్వరం 8వ వింత అని కేసీఆర్ అనలేదా అని ప్రశ్నించారు. మూడేళ్లలో నిర్మాణం, మూడేళ్లలో కూలిపోవడం 8వ వింతగా కేసీఆర్ చెప్పిందే నిజం అయ్యిందని విమర్శించారు. ఎన్డీఎస్ఏ రిపోర్టు ద్వారా గత బీఆర్ఎస్ ప్రభుత్వ బాగోతం బయటపడిందని విమర్శలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టును డిజైన్ చేసింది కేసీఆర్ అని ఆరోపించారు. తుమ్మిడిహెట్టి వద్ద ఈ ప్రాజెక్టు కట్టకుండా.. కమిషన్ల కోసం వేరే చోట ప్రాజెక్టు కట్టారని మండిపడ్డారు. త్వరలోనే బాధ్యులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎన్డీఎస్ఏకు ఎస్-ఎల్‌బీసీ ప్రమాదాన్ని విచారణకు ఎందుకు ఇవ్వడం లేదని బీఆర్ఎస్ నేతలు అడుగుతున్నారని అన్నారు. కాళేశ్వరంపై ఎన్డీఎస్ ఇచ్చిన రిపోర్ట్‌పై కేటీ-ఆర్‌కు అవగాహన లేదని, ఆయన మాట్లాడకపోవడం చాలా మంచిదని అన్నారు. మేడిగడ్డ దగ్గర ప్రాజెక్ట్ నిర్మిస్తే విఫలం అవుతుందని రిటైర్డ్ ఇంజనీర్ అధికారులే చెప్పారని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. కాళేశ్వరం కథ త్వరలోనే అందరికీ తెలుస్తుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రీడిజైనింగ్ పేరుతో కాళేశ్వరం చేపట్టి మోసం చేశారన్నారు. 'తెలివున్న వారెవరైనా కాళేశ్వరం చేపడతారా? మేడిగడ్డ కుంగిపోవడం చిన్న విషయం అన్నట్లుగా మాట్లాడారు. మేడిగడ్డ, సుందిళ్ల పనికిరావని ఎన్డీఎస్ఏ నివేదిక ఇచ్చింది. వాటిలో నీళ్లు నింపితే ఈపాటికే మొత్తం కొట్టుకుపోయేది. ప్రాజెక్టు నిర్మాణానికి తుమ్మిడిహట్టి సరైన ప్రాంతమని ఇంజినీర్లు చెప్పారు. తుమ్మిడిహట్టి పూర్తయితే కాంగ్రెస్‌కు పేరు వస్తుందని పక్కన పెట్టారని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు.




# బిఆర్ఎస్ నేతల వ్యాఖ్యలపై కేసు

### తీన్మార్ మల్లన్నకు హైకోర్టు నోటీసులు

**హైదరాబాద్,(క్రైమ్ మిర్రర్):** ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు హైకోర్టు నోటీసులు ఇచ్చింది. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా తనకు వ్యతిరేకంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డిలు నకిలీ వీడియోలను విడుదల చేశారని.. వారిపై చర్యలు తీసుకోవాలంటూ మేడిపల్లి పోలీస్ స్టేషన్ లో తీన్మార్ మల్లన్న ఫిర్యాదు చేశారు. దీంతో గతేడాది మే 25న వారిద్దరిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అయితే, తాజాగా ఈ కేసును కొట్టేయాలని కోరుతూ కెటిఆర్, జగదీశ్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ క్రమంలో న్యాయస్థానం విచారణ చేపట్టగా.. వ్యక్తిగతంగా ఎవరినీ ఉద్దేశించి కెటిఆర్, జగదీశ్ రెడ్డిలు వ్యాఖ్యలు చేయలేదని.. రాజకీయ కక్షసాధింపులో భాగంగా కేసు నమోదు చేశారని..కాబట్టి ఈ కేసును కొట్టివేయాలని పిటిషనర్ల తరఫున న్యాయ వాది వాదనలు వినిపించారు. దీంతో పోలీసులు, తీన్మార్ మల్లన్నకు కోర్టు నోటీ-సులు జారీ చేసిందది.

# ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో సహాయక చర్యలు నిలిపివేత

## నిపుణుల కమిటీ సూచనలతో అధికారుల నిర్ణయం




**నాగర్ కర్నూలు,(క్రైమ్ మిర్రర్):** తెలంగాణ రాష్ట్రాన్ని కుదిపేసిన ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో గల్లంతైన వారి కోసం గత 63 రోజులుగా అవిశ్రాంతంగా కొనసాగిన రెస్క్యూ ఆపరేషన్‌కు తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఇద్దరి మృతదేహాలను వెలికితీసిన రెస్క్యూ సిబ్బంది, మిగిలిన ఆరుగురి కోసం తవ్వకాలు జరుపుతున్నారు. అయితే, టన్నెల్‌లో నిరంతరం పనిచేసిన ఎక్స్‌కవేటర్లు గురువారం బయటకు వచ్చాయి. శిథిలాల తొలగింపు దాదాపు పూర్తయినప్పటికీ, ప్రమాదకరమైన జోన్‌లో మాత్రం ఇంకా తొలగించాల్సి ఉందని అధికారులు తెలిపారు. సాంకేతిక కమిటీ సూచనల మేరకు, సహాయక చర్యలను మూడు నెలల పాటు నిలిపివేశారు. తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రాజెక్టులో ఫిబ్రవరి 22న దుర్ఘటన సంభవించిన విషయం తెలిసిందే. శ్రీశైలం ఎడమగట్టు కాలువ ఎస్ఎల్‌బీసీ)సొరంగంలో కొనసాగుతున్న సహాయక చర్యలను నిలిపివేయాలని సాంకేతిక కమిటీ- నిర్ణయానికి వచ్చింది. టన్నెల్ యొక్క ఇన్లెట్ వైపు నుండి 13.6 కిలోమీటర్ల తర్వాత ముందుకు వెళ్లడం సురక్షితం కాదని కమిటీ- స్పష్టం చేసింది. ఈ మేరకు, గురువారం జలసౌధలో రెవెన్యూ శాఖ (విపత్తులు) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ అధ్యక్షతన సాంకేతిక కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఫైర్ సర్వీసెస్ డీజీ నాగిరెడ్డి, నీటిపారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఏపీలోని ఎన్‌డీఆర్ఎఫ్ 10వ బెటాలియన్ కమాండెంట్, నేషనల్ జియోఫిజికల్ పరిశోధనా సంస్థ డైరెక్టర్, జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డిప్యూటీ- డైరెక్టర్, నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ భూశాస్త్రవేత్త , బార్డర్ రోడ్ ఆర్గనైజేషన్ (బీఆర్‌వో) నుండి టన్నెల్ నిపుణులు పరీక్షిత్ మెహ్రా పాల్గొన్నారు. వారి సూచనల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నారు.

# దారితప్పి వస్తున్న రాహుల్‌కు స్వాగతం

## 16నెలల కాంగ్రెస్ పాలనలో రాచి రంపాన పెట్టారు.. ఎమ్మెల్సీ కవిత ఎద్దేవా చేస్తూ ట్వీట్



**హైదరాబాద్,(క్రైమ్ మిర్రర్):** కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తెలంగాణ పర్యటన నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సెటైర్లు వేశారు. దారితప్పి తెలంగాణకు వస్తున్న ఎన్నికల గాంధీ గారికి స్వాగతం అని వ్యంగ్యంగా అన్నారు. మోసపూరిత హామీలు.. అబద్ధపు వాగ్దానాలతో తెలంగాణ ప్రజలను నిండా ముంచేసి హైదరాబాద్‌కు వస్తున్న రాహుల్ గాంధీకి సుస్వాగతం అని విమర్శించారు. ఈ మేరకు ట్విట్టర్ (ఎక్స్) వేదికగా రాహుల్ గాంధీకి ఎమ్మెల్సీ కవిత పలు ప్రశ్నలు సంధించారు. 16 నెలల పాలనలో ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం రాచిరంపాన పెట్టిందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. హైడ్రా, మూసీ పేరుతో పేద ప్రజల మీదికి బుల్డోజర్లు పంపిందని.. లగచర్ల బంజారా ఆడబిడ్డలపై అర్ధరాత్రి వేళ అఘాయిత్యాలకు ఒడిగట్టిందని.. సర్కారు దుశ్చర్యకు అడ్డంకిగా ఉన్నారని బంజారా యువతపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిందని తెలిపారు. ఎర్ర బుక్కు పట్టుకుని రాజ్యాంగాన్ని రక్షించాలంటూ దేశమంతా తిరిగే మీరు తెలంగాణలో మీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మానవ హక్కులను మంటకలుపుతూ.. దమనకాండ కొనసాగిస్తూ.. ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేస్తుంటే ఎందుకు మౌనంగా ఉన్నారు.. మీ మౌనం దేనికి సంకేతమని నిలదీశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం సాగించిన ఈ రాక్షసకాండను జాతీయ మానవ హక్కుల కమిషన్ నిర్ధారించిందని పేర్కొన్నారు. కరెంట్ పోయిందని సోషల్ మీడియాలో పోస్ట్ పెడితే అరెస్టులు చేస్తున్నారని, వేధింపులకు గురిచేస్తూ, బెదిరింపులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. పచ్చని అడవిని సర్వనాశనం చేస్తున్నారని సెంట్రల్ యూనివర్సిటీ- విద్యార్థులు నిరసనకు దిగితే వారిపై లాఠీల మోతలు.. అక్రమ కేసులు.. అరెస్టులతో వేధించారని ఎమ్మెల్సీ కవిత తెలిపారు. ఈ హైదరాబాద్ పర్యటనలో హెచ్‌సీయూను సందర్శించి లాఠీ దెబ్బలు తిన్న, వేధింపులకు గురైన విద్యార్థులను పరామర్శించాలని రాహుల్‌గాంధీకి సూచించారు. తెలంగాణ ప్రజలు సోనియాగాంధీని, మీ సోదరి ప్రియాంకా గాంధీని.. మిమ్మల్ని నమ్మి అధికారమిస్తే ఉమ్మడి రాష్ట్రంలో కన్నా తీవ్ర నిర్బంధం, అణచివేతను బహుమతిగా ఇచ్చారని విమర్శించారు. బిహార్ లో విద్యార్థుల గోడు వినాలని వారి పక్షాన గళమెత్తిన మీరు.. తెలంగాణలో గ్రూప్ -1 అభ్యర్థుల ఆందోళనలపై ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. మీరు, సోనియా గాంధీ ఇచ్చిన ఆరు గ్యారంటీ-ల పరిస్థితి ఏమిటని ఎమ్మెల్సీ కవిత నిలదీశారు. డిసెంబర్ 9 , 2023 న రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ఇచ్చిన హామీని సగానికే పరిమితం చేశారని.. దేశానికి ఆదర్శంగా నిలిచిన రైతుబంధు పథకానికి తూట్లు- పొడిచి ఆ పథకాన్ని నిర్వీర్యం చేశారని.. అయినా మీ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నిలదీయరెందుకు అని అడిగారు.

# హైదరాబాద్‌లో అందాల పోటీలు..

- **నందిని గుప్తాకు స్వాగతం పలికిన పొన్నం ప్రభాకర్, స్మితా సబర్వాల్**
- **ఫెమినా మిస్ ఇండియా 2023 నందిని గుప్తా హైదరాబాద్‌కు రాక**
- **మిస్ వరల్డ్ 2025 పోటీల ప్రచారంలో భాగంగా పర్యటన**
- **బేగంపేట టూరిజం ప్లాజాలో మంత్రి పొన్నం, స్మితా సబర్వాల్ స్వాగతం**
- **మే 7 నుంచి 31 వరకు తెలంగాణలో 72వ మిస్ వరల్డ్ పోటీలు**




తెలంగాణ రాష్ట్రం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న 72వ మిస్ వరల్డ్ 2025 అందాల పోటీల ప్రచారంలో భాగంగా 'ఫెమినా మిస్ ఇండియా 2023' విజేత నందిని గుప్తా శనివారం హైదరాబాద్ నగరానికి విచ్చేశారు. బేగంపేటలోని టూరిజం ప్లాజాలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి స్మితా సబర్వాల్ ఆమెకు సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్, నందిని గుప్తాను శాలువాతో సత్కరించి, మిస్ వరల్డ్ పోటీల విజయవంతానికి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రానికి పెట్టుబడులను, పర్యాటకులను మరింతగా ఆకర్షించే లక్ష్యంతో ఈ అంతర్జాతీయ స్థాయి అందాల పోటీలకు ఆతిథ్యం ఇస్తోంది. రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించే ఈ పోటీలు మే 7వ తేదీ నుంచి మే 31వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ పోటీలలో సుమారు 140 దేశాలకు చెందిన అందగత్తెలు పాల్గొంటారని అంచనా. పోటీలలో భాగంగా వివిధ కార్యక్రమాలను తెలంగాణలోని చారిత్రక, పర్యాటక ప్రాముఖ్యత కలిగిన 10 ప్రాంతాలలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

## దారుణం... ప్రియుడితో కలిసి భర్తకు ఉరేసి చంపిన భార్య

**రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం దన్నారంలో వ్యక్తి హత్య**

**ప్రియుడితో కలిసి భార్య ప్రమీల ఈ ఘాతుకానికి పాల్పడినట్లు ఆరోపణ**

రంగారెడ్డి జిల్లాలో ఒక విషాదకరమైన సంఘటన చోటుచేసుకుంది. కందుకూరు మండలం దన్నారం గ్రామంలో ఓ మహిళ తన వివాహేతర సంబంధం కారణంగా భర్తను ప్రియుడితో కలిసి హత్య చేసింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.పోలీసుల కథనం ప్రకారం, దన్నారం గ్రామానికి చెందిన ప్రవీణ్, ప్రమీల దంపతులకు ఇద్దరి పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా ప్రమీలకు మరో వ్యక్తితో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయంపై భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నట్లు స్థానికులు తెలిపారు.శుక్రవారం అర్ధరాత్రి ప్రమీల తన ప్రియుడితో కలిసి ఇంట్లో నిద్రిస్తున్న ప్రవీణ్‌కు ఉరివేసి హత్య చేసింది. అనంతరం, అది ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేసింది.

## ఎడిటోరియల్




ప్రభుత్వాల హవా తగ్గి కార్పొరేట్లు, గుప్పెడుమంది వ్యక్తులు రాజ్యాన్ని శాసించే స్థితి ప్రపంచమంతటా వచ్చి చాన్నాళ్లవుతోంది. ఇలాంటి స్థితిలో డిజిటల్ మార్కెటింగ్ చట్టం (డీఎంఏ) ఉల్లంఘనలకు పాల్పడినందుకు అమెరికన్ బడా టెక్ సంస్థలు యాపిల్, మెటా (ఫేస్‌బుక్)లకు భారీయెత్తున జరిమానా విధించి యూరోపియన్ యూనియన్ (ఈయూ) కొంత సాహసాన్ని ప్రదర్శించిందనే చెప్పాలి. యాపిల్ సంస్థకు 57 కోట్ల డాలర్లు (రూ. 4,868 కోట్లుపైగా), మెటా సంస్థకు దాదాపు 23 కోట్ల డాలర్లు (రూ. 1,965 కోట్లు) ఈయూ పెనాల్టీ విధించింది. వచ్చే జూన్ చివరికల్లా యాపిల్ ఈయూ నిబంధనలకు భిన్నంగావున్న తన యాప్ స్టోర్ నిబంధనల్లో సవరణలు చేయకపోతే రోజువారీ జరిమానాలు మొదలవుతాయి.

మెటా సంస్థ నిరుడు ఈయూ నోటీసు అందుకున్నాక దారికొచ్చి యాప్ స్టోర్‌లో మార్పులు తెచ్చింది. అందువల్ల పాత తప్పులకు మాత్రమే జరిమానా పడింది. ఈయూ తమపై కక్షసాధింపు ధోరణిలో వ్యవహరిస్తున్నదని ఆ రెండు సంస్థలూ ఆరోపిస్తున్నాయి. నిజానికి ఈ రెండు సంస్థలకు విధించిన జరిమానాలూ చాలా తక్కువన్న అభిప్రాయం యూరప్ ప్రజల్లోవుంది.

మ్యూజిక్ స్ట్రీమింగ్‌లో నిబంధనల ఉల్లంఘన జరిగిందంటూ నిరుడు యాపిల్ సంస్థకు 205 కోట్ల డాలర్ల (రూ. 17,500 కోట్లపైమాటే), మెటా సంస్థకు 90 కోట్ల డాలర్ల (రూ. 7,685 కోట్లకుపైగా) జరిమానాలు విధిస్తున్నట్టు ఈయూ ప్రకటించింది. ఏడాదిగా ఆ సంస్థల వివరణను పరిశీలించే పేరిట తాత్సారం చేసి చివరకు తుది తీర్పు ప్రకటించింది. ఆ సంస్థలు మాత్రం ఇది కూడా అన్యాయమేనన్నట్టు భూమ్యాకాశాలు ఏకం చేస్తున్నాయి. వర్తమాన పరిస్థితుల్లో

## కార్పొరేట్ సంస్థలకు కళ్లెం

ఈయూ ఈ స్థాయి జరిమానాలు విధించటం ఒకరకంగా సాహసమనే చెప్పాలి. ఎందుకంటే అమెరికా అధ్యక్ష పీఠాన్ని ట్రంప్ అధిష్ఠించాక లెక్కలు మారిపోయాయి. సర్వరోగ నివారిణిగా ఆయన అధిక సుంకాల మోతమోగిస్తానంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ప్రత్యేకించి అమెరికన్ టెక్ కంపెనీల జోలికి ఎవరొచ్చినా తాట తీస్తామంటున్నారు. మొన్న ఫిబ్రవరిలో ప్యారిస్‌లో జరిగిన కృత్రిమ మేధ సదస్సు సందర్భంగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఈయూపై బాహాటంగానే అక్కసు వెళ్లగక్కారు.

ఏఐ ప్రగతిని అడ్డుకునేలా యూరప్ వ్యవహ రిస్తున్నదని, అమెరికా బడా సంస్థలను అతిగా నియంత్రించే పోకడలు మానుకోవాలని హెచ్చరించారు. ఆయన ప్రత్యేకించి డీఎంఏ, డిజిటల్ సర్వీసెస్ చట్టం (డీఎస్ఏ)లను ప్రస్తావించారు కూడా. జనరల్ డేటా ప్రొటెక్షన్ రెగ్యులేషన్ (జీడీపీఆర్) సైతం తమకు సమ్మతం కాదని తెలిపారు. యూరప్ దేశాల్లో నిబంధనలు తమ వ్యాపార విస్తరణకూ, లాభార్జనకూ ఆటంకం కలిగిస్తున్నాయని ప్రభుత్వానికి ఫిర్యాదులందుతున్నట్టు వాన్స్ వివరించారు. ఈ పోకడల్ని సహించబోమన్నారు. ఇదంతా గుర్తుంచుకుంటే ఈయూ తాజా నిర్ణయంలోని ఆంతర్యమేమిటో బోధపడుతుంది.

కాకి పిల్ల కాకికి ముద్దన్నట్టు ఏటా కోట్లాది డాలర్లు పన్నుల రూపంలో చెల్లిస్తున్న తమ బడా సంస్థలంటే అమెరికాకు అభిమానంవుండొచ్చు. కానీ ఆ సంస్థలు రకరకాల నిబంధనల పేరిట సాధారణ వినియోగదారుల్ని పీల్చి పిప్పి చేస్తున్నా, దివాలా తీయిస్తున్నా వేరే దేశాల వారెవరూ మాట్లాడకూడదని ట్రంప్, వాన్స్ భావించటం తెంపరితనం తప్ప మరోటి కాదు. యాపిల్ యాప్ స్టోర్‌లో లభించే మ్యూజిక్ యాప్ తదితరాలపై అధికంగా వసూలు చేస్తున్నారని భావించే వినియోగదారులు నేరుగా తమ వద్ద కొనుగోలు చేయొచ్చని చెప్పే డెవలపర్ల సందేశం కనబడకుండా, ఆ యాప్‌కు నేరుగా తీసుకెళ్లే లింక్‌లు పనిచేయకుండా యాపిల్ నిరోధిస్తున్నది.

ఇక మెటా అయితే తన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో లభ్యమయ్యే యాప్‌లు కావాలంటే వినియోగదారుల వ్యక్తిగత డేటా ఉపయోగించుకోవటానికి అనుమతించాలని షరతు విధిస్తోంది. అంగీకరించనివారికి ఆ యాప్‌లలో వాణిజ్య ప్రకటనలు కనబడేలా చేస్తోంది. అవి వద్దనుకుంటే నెలవారీ ఫీజు చెల్లించాలని డిమాండ్ చేస్తోంది. సాంకేతికతలు ఎంతగానో విస్తరించిన ఈ తరుణంలో బడా కార్పొరేట్ సంస్థలు వాటిపై ఆధారపడకతప్పని స్థితి జనాలకు కల్పించి చెల్లిస్తారా... చస్తారా అన్నట్టు పీక్కుతింటున్నాయి. ఈ స్థితిలో కీలెరిగి వాతపెట్టిన చందాన డీఎంఏ రంగప్రవేశం చేసింది. టెక్ కంపెనీలు ఉల్లంఘనలకు పాల్పడితే ఆ సంస్థల ప్రపంచ టర్నోవర్‌లో 10 శాతం, పదే పదే ఆ తప్పులు చేస్తూ పోతే ప్రపంచ టర్నోవర్‌లో 20 శాతం మేర జరిమానాలు విధించాలని చట్టం నిర్దేశిస్తోంది. కార్పొరేట్ సంస్థలకు వాతలుపెట్టి అనవసరంగా ట్రంప్ ఆగ్రహాన్ని చవిచూడటమెందుకని ఈయూ జంకుతున్న వైనం తాజా నిర్ణయంలో స్పష్టంగా కనబడుతోంది. వాటిపై చర్య తీసుకుంటున్నామన్న అభిప్రాయం యూరప్ ప్రజల్లో కలగాలి... అదే సమయంలో ట్రంప్ చేత చీవాట్లు తినకుండా, ఆయనగారిని మరీ నొప్పించకుండా గండాన్ని గట్టెక్కాలి అని ఈయూ భావిస్తోంది. అయితే మనకన్నా ఈయూ ఎంతో నయం. గుత్తాధిపత్య వ్యాపార ధోరణులను అరికట్టడానికున్న కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కఠినంగా ఉండలేకపోతున్నది. గూగుల్ సంస్థ పోకడలను అరికట్టడంలో ఎంతో కొంత విజయం సాధించినా అది చాలినంతగా లేదు. వినియోగదారులూ, స్థానిక పరిశ్రమలూ నిలువుదోపిడీకి గురికాకుండా... టెక్ సంస్థలైనా, మరే ఇతర సంస్థలైనా ఇష్టారాజ్యంగా వ్యవహరించకుండా ప్రభుత్వాలు పనిచేయాలి.

# కెసిఆర్‌కు ఆత్మవిమర్శ చేసుకునే ధైర్యం ఉందా ?



రాజకీయాల్లో విమర్శలే కాదు..ఆత్మవిమర్శలూ అవసరం. ఆత్మవిమర్శ చేసుకుంటూ ముందుకు సాగితేనే రాజకీయ పార్టీలకు మనుగడ ఉంటుంది. ఎంతసేపు ఎదుటి పార్టీని తిడుతూ రాజకీయ పబ్బం గడపుకోవడం ద్వారా లక్ష్యం నెనరవేరదు. ముఖ్యంగా ఆదివారం రజతోత్సవ సభ జరుపుకోబోతున్న టిఆర్ఎస్ ఉరఫ్ బిఆర్ఎస్ వరంగల్ వేదిక నుంచి విమర్శలను పక్కన పెట్టి ఆత్మవిమర్శ చేసుకోవాలి. తొమ్మిదిన్నరేళ్ల కాలంలో చేసిన పాపాలకు, వస్తున్న విమర్శలకు ప్రాయశ్చిత్తం చేసుకుంటామని ప్రకటించాలి. తెలంగాణాలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే అవకాశాలు లేకున్నా..బిఆర్ఎస్ చేసిన తప్పిదాల వల్ల అధికారం మారింది. తెలంగాణను అద్భుతంగా అభివృద్ధి చేశామని చెబుతున్న బిఆర్ఎస్ నేతలు ఈ డబ్బాకొట్టుకునే విధానాన్ని మానుకోవాలి. ప్రధానంగా కాళేశ్వరం వల్ల లక్షకోట్లు గంగపాలయ్యాయి. అందులో కెసిఆర్ కుటుంబానికి ఎంత ముట్టిందనేది వారికి తెలుసు. అలాగే ధరణితో రైతులను, ప్రజలను ఆగం చేశారు. వేలాది ఎకరాల ప్రభుత్వ, సామాన్యుల భూములు అన్యాక్రాంతం అయ్యాయి. వేలాది ఎకరాలు అప్పనగా ఎందరికో కట్టబెట్టారు. ఎన్నో భూములను తెగనమ్మారు. తన ప్రయాణంలో అనేక ఒడిదుడుకులు ఎదుర్కొన్నా.. అనేక చీకటి కోణాలు. కుంభకోణాలకు కారణభూత మయ్యింది. నేలవిడిచి సాము చేసిందన్న చందంగా అసలు పాలన గాలికి వదిలి స్వార్థ రాజకీయాల కోసం తెలంగాణ కోసం గులాబీ జెండాను ప్రజలే నిలబెట్టారన్న విషయాన్ని విస్మరించి నేలవిడిచి సాము చేశారు. తెలంగాణ వస్తే ఉద్యోగాలు వస్తాయని, జీవితాలు బాగుపడతాయని సబ్బండవర్గాలు ఆశించి భంగపడ్డాయి.

మియాపూర్ భూములపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. నయీం డైరీని మల్లన్నసాగర్‌లో కలిపేశారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్‌ల పేరుతో పేదల భూములను, ఇళ్లను గుంజుకుని వారిని రోడ్డున పడేసి, కుక్కకు బొక్కేసినట్లు కొంత పడేశారు. వారు గౌరవంగా బతికేలా చేయలేదు. వారి ఉసురు తీసుకున్న తీరు ప్రజలందరికీ తెలుసు. లిక్కర్ బిజినెస్‌లో కవిత తలదూర్చి తెలంగాణ పరువు తీసారు. ఎదుటి పార్టీ ఎమ్మెల్యేలను సంతలో పశువుల్లా తమ దొడ్లో కలుపుకున్నారు. ఇకపోతే తాహతుకు మించి అప్పులు చేసి, అభివృద్ధి చేశాని నమ్మించి, బంగారు తెలంగాణ పేరుతో అప్పుల తెలంగాణను చేశారు. ఇవన్నీ కంటికి కనిపిస్తున్న పచ్చి నిజాలు. వీటికి సాక్ష్యాలు అక్కర్లేదు. ఫోన్ ట్యాపింగ్ లాంటి దగుల్బాజీ పనులు ఇంకా ఎన్నో ఉన్నాయి. అందుకే తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భావం, మనుగడ సమీక్షించుకుని ముందుకు సాగాలి. ప్రజలు ఇచ్చిన అధికారన్ని ఎలా దుర్వినియోగం చేసారో గుర్తించాలి. ఇక అసెంబ్లీకి సైతం రాకుండా చట్టసభలను అవమానిస్తూ ఫాంహౌజుకే పరిమితం కావడం వెనకాల ఉన్న మతలబు ఏమిటో కూడా చెప్పాలి. అన్నింటి కంటే ముఖ్యంగా తెలంగాణ ఏర్పడినప్పుడు మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రం ఎట్లా అప్పుల పాలైందో కూడా తెలియజేయాలి. కనీసం ఉద్యోగులకు సమయానికి జీతాలు ఇవ్వలేని దుస్థితిలోకి ఎట్లా తన నాయకత్వంలో తీసుకెళ్లారో వివరించాలి. అంతేకాదు తెలంగాణ కోసం తమ విలువైన ప్రాణాలను బలిదానమిచ్చిన 1300 మంది అమరవీరుల కుటుంబాలకు ఏం చేశారో చెప్పాలి. తెలంగాణ రాష్ట్ర సాధనలోని ముఖ్యమైన లక్ష్యాల్లో ఒకటి ఉద్యోగాల భర్తీ. యూనివర్సిటీల్లో కనీసం ఒక్క కొలువునైనా ఎందుకు భర్తీ చేయలేకపోయారో చెప్పాలి. తమ జేబులు నింపడానికి, తమ కుటుంబ నేతల కడుపు నింపడానికి జరిగిన ప్రాజెక్టుల అవినీతి మీద వివరణ ఇవ్వాలి. బిఆర్ఎస్ ఉత్థాన పతనాలు గుణపాఠ్ కావాలి. ఒక నిర్దిష్టమైన లక్ష్యం కోసం పుట్టిన ప్రాంతీయ పార్టీగా ప్రజల ఆదరణ పొందిన బిఆర్ఎస్ చేయని తప్పు లేదు. ప్రజాసంఘాలు, కవులు, రచయితలు, కళాకారులు, విద్యావంతులు అంతా కలసి నడిపిస్తేనే టిఆర్ఎస్ నడిచింది. కానీ ఇదంతా తన ఒంటిచేతి చలవని, తానే అసలుసిసలు పోరాటాన్ని చేసానని కెసిఆర్ చెప్పడం మానుకోవాలి. తెలంగాణ యావత్తూ వెంటన నడిస్తేనే కెసిఆర్ పని సులభం

అయ్యింది. మలిదశ ఉద్యమానికి అనేకమంది పునాదులు వేశారు. తెలంగాణ జనసభ వంటి సంఘాలు, మారోజు వీరన్న, గాదె ఇన్నయ్య, కొండా లక్ష్మణ్ బాపూజీ, కేశవరావు జాదవ్, పాశం యాదగిరి, కొల్లూరి చిరంజీవి, ప్రొ. జయశంకర్, ప్రొ. బియ్యాల జనార్ధన్, బెల్లి లలిత వంటి వ్యక్తులు తెలంగాణ ఆకాంక్షను కాపాడడానికి శక్తిమేరకు కృషి చేశారు. ఉద్యమానికి రాజకీయ ప్రతిపత్తి లభించడం అనేది రెండవసారి కేసీఆర్ రూపంలోనే లభించినా.... ప్రజల్లో రగులుకుంటున్న ప్రత్యేక తెలంగాణ ఆకాంక్ష అన్న ఉద్యమ వేడిని కేసీఆర్ ఉపయోగించుకున్నారు. ఇవన్నీ కూడా కాదనలేని సత్యాలు. ఇవన్నీ విస్మరించి గత పదేళ్ల అధికారంలో ఉన్న కాలంలో కెసిఆర్, ఆయన చంచాలు వీరందరినీ విస్మరించి తామే వీరులం, శూరులం అని ఉద్యమకారులను చులకన చేశారు. 2001లో జలవిహార్ వేదికగా రాజకీయ పార్టీకి అంకురార్పణ చేశాక అది ముందుకు నడిచిందంటే...ప్రజల అండదండలతోనే అన్నది విస్మరించరాదు. కెసిఆర్ తన స్వార్థ రాజకీయాలకు తెలంగాణను వాడుకున్నారు. కానీ తెలంగాణ ప్రజలు ముఖ్యంగా జయశంకర్ సార్ లాంటి వారు కెసిఆర్‌ను నమ్మి నడిపించారు. మలిదశ ఉద్యమం ఊరూరికి విస్తరించి తెలంగాణ ఆకాంక్ష మరింత పదునెక్కగలిగిందంటే అందుకు..ప్రజల్లో ఉన్న ప్రత్యేక ఆకాంక్ష మాత్రమే. ఆ సమయంలో కెసిఆర్ ఉన్నా మరొకరు ఉన్నా తెలంగాణ ఉద్యమం ముందుకు సాగేది. అయితే ఉద్యమ గమ్యాన్ని ముద్దాడేలా చేసిన ప్రజలను విస్మరించి, స్వార్థచింతనతో పాలన సాగించడం వల్లనే ప్రజలు బిఆర్ఎస్‌ను దూరం పెట్టారు. దీనిపై కెసిఆర్, ఆయన కుటుంబ సభ్యులు ఆత్మపరిశీలన చేసుకోవాలి.

ప్రజలంతా ఇంతటి అంకితభావంతో అండగా నిలిస్తే... కేసీఆర్ మాత్రం పక్కా రాజకీయ నేతగా ఆలోచించారు. తను, తన కుటుంబమే తెలంగాణ అని భావించారు. తెలంగాణకు ఒక స్వీయ రాజకీయ శక్తి అవసరం అన్న ఆలోచన నుండి కేసీఆర్ యూటర్న్ తీసుకోవడం తెలంగాణ రాకముందే మొదలైంది. దళితుణ్ణే ముఖ్యమంత్రిని చేస్తానని మాట ఇచ్చి తప్పాడు. మాట తప్పడం అనేది అధికారంలోకి వచ్చాక నిత్యకృత్యంగా మారింది. తెలంగాణ పేగుబంధాన్ని తెంపుకుని అధికారం కోసం జాతీయ రాజకీయాలంటూ కొత్త పోకడలకు పోయారు. ఉట్టికి ఎగలేనమ్మ..ఆకాశానికి ఎగిరిందన్న సామెత ను రుజువు చేశారు. తెలంగాణ అంతా బంగారం అయ్యిందన్న ప్రచారం మొదలు పెట్టారు. ధనిక రాష్టరం అన్నారు. రియల్ రంగంలో అడుగులు వేశారు. పార్టీ పేరును 'భారత రాష్ట్ర సమితి'గా మార్చుకొని దేశ రాజకీయాలవైపు అర్రులు చాచి, దారుణంగా విఫలమయ్యారు. ఇంత రాజకీయ దురాశ ఉంటే ప్రజలు మాత్రం వేరుగా ఎందుకు ఆలోచిస్తారు. అందుకే కర్రుకాల్చి వాతపెట్టారు. అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం దక్కకుండా చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో మరింతగా వాతలు పెట్టారు. ఇవన్నీ ఆలోచన చేసుకుని ఇప్పుడు ఆత్మవిమర్శ చేసుకోవాలి. ఏడాదిన్నర కాకుండానే కాంగ్రెస్ మీద అగ్గిమీద గుగ్గిలంలా లేస్తే..ప్రజలు గతాన్ని మరచి పోరు. తప్పిదానలు నెమరు వేసుకునే సమయమిది. అధికారంలోకి వచ్చాక కేసీఆర్ రాచరికపు పోకడలకు బీజం వేశారు. తనను కలవడమంటేనే...రాజును కలిసేంత అన్న తీరుతో వ్యవహరించారు. రాజును కలిసే డోర్లు మూసుకు పోయాయి. సిఎంను కలవాల్సిన పనేముందని యువరాజు ఆక్షేపించారు. ఉద్యమం ద్వారా పోరాడి సాధించుకున్న తెలంగాణ తన జాగీరు అన్నట్లుగా నిరంకుశ పోకడలకు పోయి ఇవాళ నీతుల చెబితే వినడానికి ప్రజలు సిద్దంగా లేరు. రజతోత్స సభలో తప్పులపై చర్చ చేయాలి. ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలి.

# ఆత్మరక్షణలో పాక్ నేతలు

## సింధూజలాల ఒప్పందం రద్దుతో గిలగిల

## తట్టుకోలేక పలు రకాలుగ ప్రేలాపనలు

ఇస్లమాబాద్,ఏప్రిల్26(ఆర్ఎన్ఎ): పహల్గాం దాడి వెనుకున్న కీలక సూత్రధాని పాక్‌కు ఝలకిచ్చేందుకు భారత్ సింధూ నదీ జలాల ఒప్పందాన్ని నిలుపుదల చేయడం ద్వారా దయాది దేశానికి భాతర్ గట్టి షాకే ఇచ్చింది. రాబోయే ముప్పును తలుచుకుని పాక్ రాజకీయ నేతలు మొదలు సామాన్యుల వరకూ ఇప్పుడు వణికి పోతున్నారు. అయినా మేకపోతు గాంభీర్యంతో బీరాలు పలుకుతున్నారు. చిక్కులు తప్పవని చింతిస్తున్నారు. ప్రధాని మోదీ బీహార్‌లో చేసిన ప్రసంగం తరువాత పాక్ నేతలు తమ నోటికి పనిచెప్పడం మొదలెట్టారు.ఉగ్రవాదులను ప్రపంచం అంచులవరకూ వెంటాడి అంతమొందిస్తామని ప్రధాని మోదీ బీహార్‌లో ప్రసంగించిన విషయం తెలిసిందే. ఉగ్రవాదులను, వారికి మద్దతు ఇచ్చే వారిని వదిలిపెట్టేది లేదని గట్టి వార్నింగ్ ఇచ్చారు.భారత్ చర్యలు పాక్‌కు భారీ షాకిచ్చాయనేందుకు సూచనగా అక్కడి పీపీపీ పార్టీ నేత బిలావాట్ భుట్టో జర్దారీ సంచలన వ్యాఖ్యలు చేశాడు. సింధూ నదీలో నీరు ప్రవహించకపోతే పాక్ ప్రత్యర్థుల రక్తం పారుతుందంటూ బిలావాల్ నోరు పారేసుకున్నారు. సింధూ నాగరికత పరిరక్షకులం తామే అంటూ భారత్‌కు హెచ్చరికలు జారీ చేశారు. సింధూ నది మాదే. ఎప్పటికీ మాదే. నదిలో నీరైనా పారుతుంది లేదా వారి రక్తమైనా పారుతుంది. పాకిస్థాన్ గానీ అంతర్జాతీయ సమాజం కానీ ఈ యుద్ధ కాంక్షను అస్సలు సహించదు. వేల ఏళ్ల నాటి సింధూ నాగరికతకు తాము వారసులమని మోదీ అంటుంటారు. కానీ ఈ సంస్కృతికి పరిరక్షకులము మేమే. ఎట్టి పరిస్థితుల్లోనూ కాపాడుకుంటామని అంటూ ఓ ర్యాలీలో ప్రగల్భాలు పలికారు. భారత్‌తో ఉద్రిక్తతలు మరింత ముదిరేలా బాధ్యతారహిత వ్యాఖ్యలు చేశారు.అంతకు మునుపు, పాక్ రక్షణ శాఖ మంత్రి కూడా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. భారత్, పాక్‌ల మధ్య సింధూ, దాని ఉపనదుల జలాల పంపిణీ కోసం 1960లో ఈ ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం తూర్పున ఉన్న బియాస్, రావీ, సట్లజ్ నదుల్లోని నీళ్లపై హక్కులు భారత్‌కు, సింధూ నది, ఛెనాబ్, ఝెలమ్ నదుల నీళ్లు పాక్‌కు దక్కాయి. అయితే, పహల్గాం దాడి తరువాత పాక్ తగిన గుణపాఠం చెప్పాలన్న సంకల్పంతో ఉన్న భారత్ ఈ ఒప్పందం అమలును నిలుపుదల చేస్తున్నట్టు ప్రకటించింది. ఈ క్రమంలో సింధూ నది నీటిని భారత్ దిగువన ఉన్న పాక్‌కు విడుదల చేయకపోతే దాయాది దేశానికి షాక్ తప్పదని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

(ఆధ్యాత్మిక చింతన)

# ధర్మరక్షణ మన శ్వాస కావాలి!

ధర్మోరక్షతి రక్షితః అన్నారు. అంటే ధర్మాన్ని మనం రక్షిస్తేనే ..ధర్మం మనలను రక్షిస్తుంది. ధర్మ రోణ అన్నది నిత్యం అలవాటు కావాలి. ఆచరణలోకి తేవాలి. అప్పుడు మనం కాల ప్రవాహంలో పడి కొట్టుకొని పోకుండా ధర్మం చేత కాపాడబడతాం. అందుకే ధర్మోరక్షతి రక్షితః అన్నారు.ప్రజల్లో ధర్మం పట్ల అనురక్తి పెరగాలి. నిత్యం స్వార్థ చింతనే కాకుండా ధర్మ చింతన చేయడం అలవాటు చేసుకోవాలి. ఏది ధర్మమో అది ఆచరణకు పూనుకోవాలి. అందరూ ఆలోచించి అమలు చేసుకోవాల్సిన కార్యం. ఇది కలియుగం. యుగధర్మం ప్రకారం మూడు భాగాలు అధర్మం. ఒక భాగం ధర్మం. ధర్మాధర్మ విచక్షణ కలవారెవరైనా లౌకిక వ్యవహార సరళిని పరిశీలిస్తే యుగ ధర్మ ప్రభావం స్పష్టంగా కనపడుతుంది. ధర్మాన్ని మనం కాపాడితే ధర్మపక్షపాతియైన భగవంతుడు మనను కాపాడుతాడు. భగవంతుడు సత్పురుష పక్షపాతి కావున సత్సాంగత్యము చేసిన మనను కూడా రక్షిస్తాడు. దాని వలన మనకు కలిగే లాభం.. అనంతం, అపరిమితం. అంటే సత్సాంగత్యం మాత్రమే మనలను కష్టాల నుంచి కాపాడుతుంది. ఇలాంటి సందర్భంలో.. భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పిన 'ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే' అనే మాట స్ఫురిస్తుంది. 'ధర్మాన్ని నెలకొల్పడానికి ప్రతియుగంలో అవతరిస్తాను' అన్న భగవద్వాక్యం ప్రకారం.. ధర్మమే జయించగలదు.అందుకే మన పెద్దలు అందుకే మన పెద్దలు సత్సాంగత్యం అవసరమని చెప్పారు. సత్సాంగత్యం వల్ల మానవుడు పొందవలసిన సకల శుభాలూ పొందగలడు. వ్యక్తులు సంస్కరింప బడితే సమాజం బాగుపడుతుంది. అప్పుడు దేశం సుఖశాంతులతో వర్ధిల్లుతుంది.సత్పురుషులైన సప్తర్షులను కలవడం వలనే బోయవాడు వాల్మీకిగా మారి ప్రపంచప్రసిద్ధి గాంచిన రామాయణ మహాకావ్య రచన చేయగలిగాడు. నరేంద్రుడు రామకృష్ణ పరమహంస అనే గురువును పొందడం వల్లనే వివేకానందుడు ప్రపంచ ప్రఖ్యాతి గాంచాడు. సువాసనగల, అందమైన పూలతో సాంగత్యము చేసి హారంగా మారడం వల్లనే దారానికి భగవంతుని కంఠసీమలో స్థానం లభించింది. పూలలో దాగుండే కొన్ని చిన్న కీటకాలు ఆ పరమేశ్వరుని శిరోభాగమును చేరగలుగుతున్నాయి. కాబట్టి, మానవులు సత్సాంగత్యం ద్వారా సత్ఫలితాలు పొందగలరని గుర్తుంచుకోవాలి. మంచి పనులు చేయడంతో పాటు, మంచి వ్యక్తులతో సావాసం చేస్తేనే మన మంచికి సార్థకత ఉంటుంది.

# ఏదులాపురం టిఎన్జీవోస్ ఉద్యోగుల హౌసింగ్ సొసైటీని సందర్శించిన టిజిజెఏసి రాష్ట్ర నాయకులు

**ఖమ్మం ( క్రైమ్ మిర్రర్ ప్రతినిధి) :** టిజిజెఏసి చైర్మన్ మారం జగదీశ్వర్ టిజిజెఏసి సెక్రటరీ జనరల్ ఏలూరు శ్రీనివాసరావు ఏదులాపురం హౌసింగ్ సొసైటీని సందర్శించి సొసైటీలో ఉన్న చర్చ్ రాములు వారి గుడి మరియు మసీదును సందర్శించారు. అనంతరం ఏలూరు శ్రీనివాసరావు హౌసింగ్ సొసైటీలో భవిష్యత్ లో ఏర్పాటు చేయవలసిన మౌలిక వసతులపై సమీక్షించి అదేవిధంగా ప్రస్తుతం అక్కడ ఉన్న లోటుపాట్లను గుర్తించారు. గుర్తించిన సమస్యలను మారం జగదీశ్వర్ దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా టీజీఈ జేఏసీ తరుపున ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్లి సంబంధిత అధికారులతో చర్చించి పెండింగ్ సమస్యలు అన్నీ పరిష్కరించడానికి ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. హౌసింగ్ సొసైటీ అభివృద్ధి కోసం అవసరమైన మౌలిక వసతులను రూపొందించి వాటిని దశలవారీగా కార్యాచరణలోకి తీసుకువచ్చి సమగ్ర అభివృద్ధి కోసం కృషి చేస్తామని వారిరువురు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీజీవో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కస్తాల సత్యనారాయణ మోదుగు వేలాద్రి టీఎన్జీవోస్ జిల్లా



అధ్యక్ష కార్యదర్శులు గుంటుపల్లి శ్రీనివాసరావు కొణిదెన శ్రీనివాసరావు అసోసియేట్ ప్రెసిడెంట్ దుర్గాప్రసాద్ రాష్ట్ర భాద్యులు జైపాల్ వైస్ ప్రెసిడెంట్ కరణ్ సింగ్ జాయింట్ సెక్రటరీ తాళ్లూరి శ్రీకాంత్ ఏలూరి కోణార్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పెద్దినేని రాధాకృష్ణ హెచ్ డబ్ల్యు ఓ ఫోరమ్ అధ్యక్షులు రుక్మారావు మధిర తాలూకా యూనిట్ అధ్యక్షులు గుర్రం శ్రీను మరియు కాలనీ వాసులు గంగవరపు బాలకృష్ణ కోలా రాంబాబు ఆంజనేయులు మురళీ మొదలగువారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అందరం కలిసి బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేద్దాం

**మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు పట్లోళ్ల రూపారెడ్డి**



**గండిపేట్(క్రైం మిర్రర్):** భారత రాష్ట్ర సమితికి ప్రజల్లో రోజు రోజుకు ఆదరణ పెరుగుతుందని మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు పట్లోళ్ల రూపారెడ్డి అన్నారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ వరంగల్‌లో బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఈ నెల 27వ తేదీన అంగరంగ వైభవంగా జరుగుతుందన్నారు. మునుపెన్నడు లేని విధంగా భారీగా ప్రజల మధ్య సభను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ ముఖ్యమంత్రి కేసిఆర్ హజరై ప్రసంగిస్తారన్నారు. నాయకులు, కార్యకర్తలను పెద్ద ఎత్తున సభకు తరలిస్తున్నామన్నారు. ఈ రజతోత్సవ వేడుకలకు మహిళామణులను అధిక సంఖ్యలో పాల్గొనేలా తమవంతు కృషి చేస్తున్నామన్నారు. వారిని క్షేమంగా తీసుకువెళ్లి క్షేమంగా తీసుకువచ్చే బాధ్యత తమదేనన్నారు. అందరం కలిసి వెళ్లి రజతోత్సవ సభను విజయవంతం చేద్దామన్నారు.

# రోడ్డు ప్రమాదాల నియంత్రనే ప్రధాన లక్ష్యం : ఎస్సై ఇరుగు రవి కుమార్

**హెల్మెట్ వాడకపోతే కఠిన చర్యలు తప్పవు**

**వాహనదారులకు హెల్మెట్ వాడకంపై అవగాహన**





మునుగోడు క్రైమ్ మిర్రర్ : రోడ్డు ప్రమాదాల నియంత్రనే లక్ష్యంగా కృషి చేస్తామని ఎస్సై ఇరుగు రవి కుమార్ అన్నారు.. మునుగోడు పొలిస్ స్టేషన్ లో శనివారం సాయంత్రం హెల్మెట్ వాడకంపై ఎస్సై ఇరుగు రవి కుమార్ వాహనదారులకు అవగాహన కల్పించారు.. అనంతరం ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడకపోవడం వల్ల ఎంతో మంది ప్రాణాలు కోల్పోయి వారి కుటుంబం రోడ్డున పడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ వాడాలి. హెల్మెట్ వాడకపోతే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.. మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇస్తే,వారి తల్లితండ్రులపై,చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు.. పోలీస్ శాఖ సిబ్బంది వీరాంజనేయులు,నాగేశ్వర్ రావు,రమణారెడ్డి,రాము,వెంకన్న,బాలాజీ,సతీ ష్,వాహనదారులు ప్రజలు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి ప్రజల సమస్యలపై పోరాడింది

**నార్సింగి మున్సిపాలిటీ వట్టినాగులపల్లి బీఆర్ఎస్ నాయకులు విష్ణువర్ధన్**



**గండిపేట్(క్రైం మిర్రర్):** బీఆర్ఎస్ ఆవిర్భవించిన నాటి నుంచి ప్రజల సమస్యల పరిష్కారం కోసమే పోరాడిందని నార్సింగి మున్సిపాలిటీ వట్టినాగులపల్లి బీఆర్ఎస్ నాయకులు విష్ణువర్ధన్ అన్నారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధి కేవలం బీఆర్ఎస్‌తోనే సాధ్యమన్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావించి 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వరంగల్‌లో ఈ నెల 27వ తేదీన రజతోత్సవ సభను పెద్ద ఎత్తున్న నిర్వహిస్తుందన్నారు. ఈ సభకు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. ప్రజలను సమీకరిస్తు సభను తీసుకువెళ్తున్నామన్నారు. భారీ ర్యాలీగా సభకు తరలివెళ్లి విజయవంతం చేసేందుకు అందరం కలిసి కృషి చేద్ధామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# త్రిఫేస్ కరెంట్ ఏర్పాటు



**చండూరు, క్రైమ్ మిర్రర్:** చండూరు మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్ కాలనీలో గత కొన్ని సంవత్సరాలుగా త్రీఫేస్ కరెంటు లేక ఇబ్బంది పడుతున్న పద్మశాలి మగ్గం నేస్తున్న వారికి మునుగోడు శాసనసభ్యుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో లో వోల్టేజ్ ప్రాబ్లం లేకుండా వారికి మగ్గం నేర్చుకోవడానికి ఇబ్బంది లేకుండా త్రీఫేస్ కరెంటు ని అందజేశారు. కృతజ్ఞతగా స్థానిక కాంగ్రెస్ నాయకులు, కాలనీవాసులుకోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చిత్రపటానికి శనివారం పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో చండూరు మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్ గౌడ్, చండూర్ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ దోటి సుజాత వెంకటేష్ యాదవ్ మాజీ సర్పంచులు నల్లగంటి మల్లేష్, కల్మికొండ జనార్ధన్, కల్లెట్ల మారయ్య, రామ్మూర్తి, బూతరాజు వేణు, బెల్లంకొండ శేఖర్ గండూరి జనార్ధన్, భూతరాజు దశరథ, ఇరిగి వెంకటేశం, గంజి వెంకటేశం, మహిళా అధ్యక్షురాళ్ళు గండు రమాదేవి, పల్లవి, కాలనీలోని మగ్గం యజమానులు పాల్గొన్నారు.

# వ్యాపారులు రోడ్లపై చెత్త వేస్తే రూ.1000 నుంచి 5000 వేల వరకు జరిమానాలు

**రాజేంద్రనగర్ సర్కిల్ ఉపకమీషనర్ కె.రవికుమార్.. పద్ధతి మార్చుకోకపోతే లైసెన్స్ రద్దు చేస్తాం**





**గండిపేట్(క్రైం మిర్రర్):** రోడ్లపై చెత్త, వ్యర్థాలు వేసే వారికి జరిమానాలు విధించాలని రాజేంద్రనగర్ సర్కిల్ ఉపకమీషనర్ కె.రవికుమార్ అధికారులకు సూచించారు. జీహెచ్ఎంసీ కమీషనర్ ఆదేశాల మేరకు శనివారం సర్కిల్ ఎస్ఎఫ్ఏలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి షాప్‌లో రెండు డస్ట్‌బిన్స్ పెట్టడంతో పాటు వారికి నల్ల కవర్లు ఇవ్వాలన్నారు. వీటిని సాట్ ఆటోలకు అనుసంధానం చేయాలని సూచించారు. రోడ్లపై చెత్త వేస్తున్న వారిని గుర్తించి షాప్‌ని బట్టి 1000 నుంచి 5000 వేల రవకు జరిమానాలు విధించాలన్నారు. రెండవ సారి కూడా ఇదే విధంగా చెత్త వేస్తే జరిమానాను రెట్టింపు చేసే విధంగా, షాప్ లైసెన్స్‌ను రదుద చేయాలని ఆదేశించారు. ప్రతి షాప్‌లో కూడా రెండు డస్ట్ బిన్స్ పెట్టాలని పెట్టకపోతే ఫైన్ కట్టాల్సి వస్తుందని సూచించారు. పెనాల్టీ విధించిన తర్వాత కేవలం ఆన్‌లైన్ ప్లాటుఫార్మ్స్ అయినటువంటి మై జీహెచ్ఎంసీ ఆప్, ద్వారా మాత్రమే చెల్లించాలని సిబ్బంది చేతికి డబ్బులు ఇవ్వవద్దు అని అన్నారు. ప్రతి వార్డుకి ముగ్గురు మెంబ్స్‌తో రెండు టీమ్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అన్ని టీమ్‌లు వారికి కేటాయించిన వార్డులని సందర్శించి రోడ్లపై చెత్త వేస్తున్న టీ బండ్లు, వీధి వ్యాపారులు, వైన్‌షాపుల వారు, కమర్షియల్ వ్యాపారస్తులని గుర్తించి ప్రతి రోజు 15 నుంచి 20 షాపులకు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. ఈ పనులను పర్యవేక్షించాల్సిన బాధ్యత ఏఎంవోహెచ్‌పై ఉందని ఆదేశించారు. అదే విధంగా పౌరులు, వ్యాపారస్తులు తమ పరిసరాలలో, రహదారుల వెంబడి, ముఖ్యమైన దారుల వెంబడి ఎక్కడ చెత్త వేయకుండా బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని జీహెచ్ఎంసీకి పారిశుధ్య నిర్వహణలో తమవంతు సహకారం అందించాలని ఆయన కోరారు.

# గొడవపడవద్దని చెప్పినందుకు బావమరిది బైక్‌కు నిప్పంటించిన బావ



**గండిపేట్(క్రైం మిర్రర్):** అక్కతో గొడవ పడవద్దని బావను మందలించడంతో కక్షపెంచుకోని బావమరిది బైక్‌కు నిప్పటించిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కార్వాన్ ప్రాంతానికి చెందిన అబ్దుల్ ఖదీర్(45) ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ ఉంటున్నాడు. సులేమాన్‌నగర్‌కు చెందిన సమీనాసుల్తానాతో గత 13 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. పెళ్లి జరిగిన నాటి నుంచి తాగుడుకు బానిసగా మారిన అబ్దుల్ ఖదీదర్ బార్యను భౌతికంగా, మానసికంగా వేధిస్తూ వస్తున్నాడు. ఈ నెల 21న భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. సమీనా సుల్తానా తమ్ముడు సమాద్‌ఖాన్ ఆమెజాన్ కంపెనీలో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. అక్క సంసారం విషయంలో కార్వాన్‌లో ఉన్న బావ ఇంటికి వెళ్లి కుటుంబ పోషణలో భాగస్వామిగా ఉండాల్సిన మీరు జులాయిగా తిరుగుతూ అక్క సమీనా సుల్తానాను శారీరకంగా, మానసికంగా హింసించడం ఏమిటని ప్రశ్నించాడు. ఈ మేరకు కక్ష పెంచుకున్న అబ్దుల్ ఖదీర్ ఈ నెల 26వ తేదీ అర్ధరాత్రి సమయంలో సులేమాన్‌నగర్‌లో ఉన్న అతని ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులు కనిపించకపోవడంతో ద్విచక్ర వాహనంపై బాటిల్‌లో తెచ్చుకున్న పెట్రోల్ పోసి నిప్పంటించి పరారైయ్యాడు. కుటుంబ సభ్యులు కనిపిస్తే పెట్రోల్ పోసి నిప్పంటించే వాడని అబ్దుల్‌ఖదీర్ నుంచి తమ కుటుంబ సభ్యులకు ప్రమాదం ఉందని సమీనాసుల్తానా ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రోడ్డు ప్రమాద బాధితుడిని పరామర్శించిన బీఆర్ఎస్ యువనేత నల్లమోతు సిద్ధార్థ

క్రైమ్ మిర్రర్, మిర్యాలగూడ: మిర్యాలగూడ మండలం తక్కెళ్ళపాడు గ్రామానికి చెందిన గోగుల నాగరాజు ఈ నెల 20వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ప్రస్తుతం ఆయన మిర్యాలగూడ పట్టణంలోని అపోలో రీచ్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మిర్యాలగూడ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు నల్లమోతు సిద్ధార్థ, హాస్పిటల్‌కు వెళ్లి బాధితుడిని పరామర్శించారు. అక్కడి వైద్య సిబ్బందితో ప్రత్యేకంగా మాట్లాడి, నాగరాజుకు అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మెరుగైన చికిత్స అందించేందుకు అవసరమైన సహకారాన్ని వెంటనే అందించాలని తెలిపారు. అంతేకాకుండా, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మరో ఇద్దరు రోగులను కూడా పరామర్శించిన సిద్ధార్థ, వారి ఆరోగ్య పరిస్థితులపై వైద్యులతో చర్చించారు. వైద్య సహాయం విషయంలో తాను ఎలాంటి సహాయానికైనా సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. నల్లమోతు సిద్ధార్థ ఈ స్పందన స్థానికంగా మంచి ప్రాచుర్యం పొందింది. బాధితుల కుటుంబ సభ్యులు ఆయన సహాయానికి కృతజ్ఞతలు తెలియజేశారు.






## నార్సింగిలోని అక్షయ పాత్రను సందర్శించి ఎంజీఐటీ విద్యార్థులు

గండిపేట్(క్రైం మిర్రర్): మహాత్మ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నార్సింగిలోని అక్షయ పాత్ర ఫౌండేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి.చంద్రమోహన్‌రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి అక్షయ పాత్ర ఫౌండేషన్ ఏ విధంగా పని చేస్తుంది, విధి నిర్వహణలో ఫౌండేషన్ ఎంతో చిత్తశుద్ధితో పని చేస్తుందని తెలిపారు. నాణ్యమైన రుచికరమైన భోజనంను వారి కిచెన్ ద్వారా తయారు చేసి ఏ విధంగా సరఫరా చేస్తారో తెలుసుకోవాలని తెలిపారు. ఈ పర్యటనలో ప్రభు వెంకటాద్రి విద్యార్థులకు చక్కటి మార్గనిర్దేశం చేశారు. ఈ కార్యక్రమలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు కె.దివిజ, వర్మ, మల్లికార్జున్, ఎన్ఎస్ఎస్ ప్రొగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి.బాల్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## బండ్లగూడ కార్పొరేషన్ కార్యాలయంలో అధికారుల సమీక్షా సమావేశం






గండిపేట్(క్రైం మిర్రర్): ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం, ప్రాపర్టీ టాక్స్ కలెక్షన్, చేయూత పెన్షన్ వెరిఫికేషన్‌పై సమీక్షించారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్ కార్యాలయంలో శనివారం కమీషనర్ శరత్‌చంద్ర అధ్యక్షతన సమీక్షా సమావేశం చేపట్టారు. వెరిఫికేషన్ ఆఫీసర్స్‌కి ప్రభుత్వ మార్గదర్శకాలు వివరించి అర్హులైన లబ్ధిదారుల జాబితాలను సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఆర్‌వో కె.శివకుమార్, ఏఈఈ వి.రాజ్‌కుమార్, వివిధ సెక్షన్ల అధికారులు, సెక్షన్ అసిస్టెంట్లు, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, ఆపరేటర్లు, శానిటరీ జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

## గొర్రెల కొనుగోళ్ల లబ్దిదారుల డబ్బులు కాజేసిన లైవ్ స్టాక్ అసిస్టెంట్...!

**విచారణకు ఆదేశించిన జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి సదానందం....!**



**క్రైమ్ మిర్రర్ వికారాబాద్ జిల్లా ప్రతినిధి:** గత ప్రభుత్వ హాయాంలో గొర్రెల పంపిణీ పథకంలో భాగంగా గొర్రెల కొనుగళ్ల కోసం లబ్దిదారుల నుంచి డబ్బులు వసూలు చేసి తిరిగి ఇవ్వని లైవ్ స్టాక్ అసిస్టెంట్ పై విచారాణ చేపట్టాలని వికారాబాద్ జిల్లా పశు సంవర్ధక, పశు వైద్య అధికారి డాక్టర్ సదానందం శనివారం ఆదేశాలు జారీ చేశారు.వికారాబాద్ జిల్లా,నవాబుపేట మండలంలోని ఎల్లకొండ పశువైద్య శాలలో పని చేసే లైవ్ స్టాక్ అసిస్టెంట్ హెచ్.శ్యామ్ రావ్ డిప్యూటేషన్ పై పులుమామిడి పశువైద్య శాలలో విధులు నిర్వహిస్తున్నాడు.రెండో విడుత గొర్రెల పంపిణీ పథకంలో భాగంగా లింగంపల్లి గ్రామానికి చెందిన కండ్లపల్లి పాండుతో పాటు మరో నలుగురు వద్ద 43,500 రూపాయలను తీసుకున్నాడు.ప్రభుత్వం మారిన తరువాత పథకం అమలు కాకపోవడంతో లబ్దిదారులకు వారు చెల్లించిన డబ్బులను తిరిగి అధికారులు చెల్లించారు.కాని శ్యామ్ రావు మాత్రం లబ్దిదారులకు డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో వారు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా పశు సంవర్ధక, పశు వైద్య అధికారి డాక్టర్ సదానందం ఈ విషయమై సమగ్రంగా విచారణ చేపట్టి నివేదిక అందించాలని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ కె వి.చంద్రశేఖర్ రావుకు ఆదేశించారు.మరి ఈ విచారణలో తేలుతుందో అనేది తెలియాల్సి ఉంది.

# బిఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి: గిర్కటి నిరంజన్ గౌడ్

చౌటుప్పల్, క్రైమ్ మిర్రర్: ఈనెల 27 ఆదివారం వరంగల్ లో జరగబోయే భారత రాష్ట్ర సమితి పార్టీ రజతోత్సవసభను విజయవంతం చేయాలని చౌటుప్పల బిఆర్ఎస్ మండల మండల పార్టీ అధ్యక్షుడు గిర్కటి నిరంజన్ గౌడ్ కోరారు. శనివారం చౌటుప్పల్ మండలం బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ... తెలంగాణలో కల్వకుంట్ల చంద్రశేఖర రావు 27 ఏప్రిల్ 2001 లో బీఆర్ఎస్ పార్టీ స్థాపించి, ఎన్నో ఉద్యమాలు నడిపించి కేంద్ర ప్రభుత్వాన్ని మెడలువంచి 2014లో ప్రత్యేక తెలంగాణ కెసిఆర్ సారథ్యంలో సాధించుకున్నామని తెలిపారు. తెలంగాణ బంగారు తెలంగాణ కావాలని ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను తీసుకొచ్చి ప్రజలకు అందించిన ఘనత తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ కే దక్కిందన్నారు. తెలంగాణలో నేడు ఆచరణ కానీ హామీలు, ఆరు గ్యారెంటీలు, 420 హామీలు చెప్పి ప్రజలను మభ్యపెట్టి ఓట్లేసుకుని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు అయినా ఏ ఒక్క హామీని కూడా అమలు చేయకుండా రాష్ట్రాన్ని అన్ని రంగాలలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం చేస్తున్నారని తెలిపారు. అధికారం అంటే అవినీతి అనే చందంగా ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ను అన్ని రంగాలలో దివాలా తీస్తుందని కాబట్టి ప్రజలందరూ మేల్కొని మళ్లీ



కెసిఆర్ కావాలి అంటూ గ్రామ గ్రామాన ఆదివారం ఉదయం 9 గంటలకు పార్టీ జెండాలను ఎగురవేసి బస్సులలో ప్రజలు ఉవ్వెత్తున బయలుదేరి వరంగల్ లో జరిగే బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవసభ ను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి పెద్దింటి బుచ్చిరెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్ రెడ్డి, బిఆర్టియు జిల్లా అధ్యక్షులు ఢిల్లీ మాధవరెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షులు చిన్నం బాలరాజు కురుమ, యాట యోగానందం, మాజీ కౌన్సిలర్ తాడూరి శిరీష పరమేష్, మాజీ గ్రంథాలయ చైర్మన్ ఊడుగు మల్లేష్ గౌడ్, దేవాలయ చైర్మన్ దేవరపల్లి గోవర్ధన్ రెడ్డి, సీనియర్ నాయకులు బొమ్మిరెడ్డి వెంకటరెడ్డి, తొర్పునూరి మల్లేష్ గౌడ్, మునుకుంట్ల నరసింహ గౌడ్, మాజీ సర్పంచులు కళ్లెం శ్రీనివాస్ రెడ్డి, పెద్దింటి చంద్రారెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు కొండ యాదగిరి, సుర్కంటి శ్రీనివాస్ రెడ్డి, పబ్బతి ఆంజనేయులు గౌడ్, చీమకండ్ల కిష్టయ్య, సమిరెడ్డి జనార్దన్ రెడ్డి, సుర్వి విజయ్ గౌడ్, మాచర్ల కృష్ణ, కడగంచి చలమందరాజు, అనిల్ యాదవ్, బత్తుల సింహాచలం, కంకల కృష్ణ, టిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కత్తులతో బెదిరించి చోరీ చేసిన ఆరుగురి అరెస్టు








గండిపేట్(క్రైం మిర్రర్): ఇంట్లోకి చోరబడి బంగారు, వెండి, నగదు ఎత్తుకెళ్లిన ఆరుగురు నిందితులను రాజేంద్రనగర్ పోలీసులు చేధించారు. నేరం జరిగిన నాలుగు రోజుల్లోనే పక్కా దర్యాప్తు పూర్తి చేసి నిందితులను అదుపులోకి తీసుకోని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శనివారం డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను వెల్లడించారు. వివరాల ప్రకారం ఈ నెల 21వ తేదీన సన్‌సిటీ పీఅండ్‌టీ కాలనీలో నివాసం ఉంటున్న మహ్మద్ షకీర్ ఆలీ ఇంట్లోకి గుర్తు తెలియని నలుగురు నిందితులు తలుపు తట్టి, బలవంతంగా ఇంట్లోకి చోరడి అతడిని, భార్యను కత్తితో బెదిరించారు. నిందితులు అల్మారాను పగలగొట్ట బంగారం, వెండి ఆభరణాలతో పాటు నగదును, రెండు మొబైల్ ఫోన్‌లను దోచుకోని పారిపోయారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇందులో మైలార్‌దేవ్‌పల్లికి చెందిన జిబ్రాన్ బిన్ జాబర్, కార్వాన్‌కు చెందిన మొహమ్మద్ అకీల్, హూమాయన్‌నగర్‌కు చెందిన మొహమ్మద్ ఫసియుద్దీన్, వట్టేపల్లికి చెందిన సోహైల్ షాఖాన్, సైఫీ కాలనీకి చెందిన మొహమ్మద్ అబ్దుల్ రబీ జావీద్, కలపత్తర్‌కు చెందిన మొహమ్మద్ షబ్బీర్‌లుగా గుర్తించారు. జిబ్రాన్ బిన్ జాబర్ బాధితులకు బంధువు కావడంతో అతడికి ఇంట్లో ఎక్కడెక్కడ ఏమి ఉంటాయో అన్ని తెలిసు. అతను ఒక ప్రణాళికను రూపొందించి ఇతర నిందుతులతో కుట్ర పన్నాడన్నారు. నేరం అమలు చేయడానికి ఆయుధాలు, తప్పించుకునే వాహనాన్ని ఏర్పాటు చేశాడన్నారు. నేరం చేయడానికి ఉపయోగించిన రెండు కత్తులు, రెండు ఫోన్‌లు, ఒక తెల్ల స్విఫ్ట్ డిజైర్ కారుల, బంగారం, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. సాధారణ పరిచయస్తులు లేదా దీర్ఘకాల బంధువులతో వ్యక్తిగత లేదా ఆర్థిక వివరాలను పంచుకోవడం మానుకోవాలన్నారు. ఇంట్లో పెద్ద మొత్తంలో నగదు లేదా విలువైన వస్తువులను నిల్వ చేయకుండా ఉండడం, సురక్షిత లాకర్లను ఉపయోగించాలన్నారు. ఇంటి వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. నేరాలను నియంత్రించేందుకు ప్రజలు సైతం బాధ్యతగా ఉండాలని డీసీపీ తెలిపారు.

# పీజేటీఏయూని సందర్శించిన భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి నూతన డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎం.ఎల్. జాట్



గండిపేట్(క్రైం మిర్రర్): భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) డైరెక్టర్ జనరల్ గా డిపార్ట్మెంట్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (డీఏఆర్ఈ) కార్యదర్శి గా నూతనంగా నియమితులైన డాక్టర్ ఎం.ఎల్. జాట్ శనివారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. పరిపాలనా భవనంలో ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో రిజిస్ట్రార్ డాక్టర్ జి.ఈ.సిహెచ్ విద్యాసాగర్, ఇతర విశ్వవిద్యాలయ అధికారులు, వివిధ విభాగాల సంచాలకులు పాల్గొన్నారు. పీజేటీఏయూ ఉపకులపతిగా గత ఆరు నెలల కాలంలో తాను తీసుకున్న చర్యల్ని జానయ్య వివరించారు. విశ్వవిద్యాలయ ప్రగతిని నెమరు వేసుకుంటూ భవిష్యత్ ప్రణాళికల్ని రూపొందించేందుకు విశ్వవిద్యాలయ వజ్రోత్సవాలని ఘనంగా నిర్వహించామని తెలిపారు. ఈ ఉత్సవాలకి సంబంధించిన వీడియోను ప్రదర్శించారు. ఎన్నో ఏళ్లుగా ఖాళీగా ఉన్న విశ్వవిద్యాలయ అధికారుల పదవులని భర్తీ చేశానన్నారు. కొత్త సవాళ్లను ఎదుర్కొనేందుకు వీలుగా విశ్వవిద్యాలయ అధ్యాపక, పరిశోధన, విస్తరణ వ్యవస్థల్ని పునర్వ్యవస్థీకరిస్తున్నామని జానయ్య తెలిపారు. అదేవిధంగా పీహెచ్‌డీ పూర్తిచేసిన అభ్యర్థులకి రెండేళ్లపాటు విశ్వవిద్యాలయంలోనే పోస్ట్ డాక్టోరల్ అకడమిక్ అప్రెంటిస్ షిప్ అవకాశం కల్పిస్తున్నామని జానయ్య అన్నారు. ఈ సమయంలో నెలకి 30 వేల రూపాయలు గౌరవ వేతనంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే విశ్వవిద్యాలయంలోని వివిధ కోర్సుల ప్రవేశాలలో ఐదు శాతం సీట్లను విదేశీ విద్యార్థులకు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయ విద్యనభ్యసించే వారిలో సుమారు 72 శాతం మంది బాలికలు ఉన్నారని అందుకు తగిన విధంగా వసతి గృహాలు మంజూరు చేయవలసిందిగా జానయ్య డీజీని కోరారు. అదేవిధంగా రాష్ట్ర విభజన తర్వాత కొన్ని అఖిల భారత సమన్వయ పరిశోధన ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్ కు వెళ్లాయని అందువల్ల తెలంగాణకు కొత్త ప్రాజెక్టుల మంజూరు చేయవలసిందిగా జానయ్య కోరారు. ఒక ప్రతిష్టాత్మకమైన సంస్థకు నాయకత్వం వహించే అవకాశం వచ్చినందుకు ఉపకులపతిని, ఇతర అధికారుల్ని డైరెక్టర్ జనరల్ ఎం.ఎల్. జాట్ అభినందించారు. తెలంగాణ అనేక అంశాల్లో దేశంలో అగ్రగామిగా నిలుస్తోందని జాట్ అన్నారు. ముఖ్యంగా భూగర్భ జల నిల్వల్ని కాపాడుకుంటూనే వరి దిగుబడిలో రాష్ట్రం అగ్రగామిగా నిలిచిందన్నారు. ప్రస్తుతం సాగుపరంగా వస్తున్న కొత్త సవాళ్లని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి వివిధ సంస్థలు అన్ని సమన్వయంతో పనిచేయాలని జాట్ పిలుపునిచ్చారు. దిగుబడితోపాటు మార్కెటింగ్, మారుతున్న వినియోగదారుల అభిరుచులు వంటి అంశాల్ని ఎదుర్కోవడానికి నూతన దృక్పథం అలవర్చుకోవాలని సూచించారు. మారుతున్న పరిస్థితుల్లో సామాజిక శాస్త్రాల నిపుణుల భాగస్వామ్యం పెరగాలన్నారు. అధ్యాపకులు, శాస్త్రవేత్తలు నిరంతరం కొత్త అంశాల్ని నేర్చుకుని తర్వాత తరాలకి అందించాలన్నారు. అందరూ సమన్వయంతో పని చేస్తూ రైతాంగం మోహంల్లో చిరునవ్వులు తీసుకురావడానికి కృషి చేయాలని జాట్ పిలుపునిచ్చారు. ఉపకులపతి ప్రస్తావించిన అంశాలకు సంబంధించి సాధ్యా సాధ్యాలు పరిశీలించి పరిష్కరించడానికి తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని %ణ+% జాట్ హామీ ఇచ్చారు.

# ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి వినతి పత్రం అందజేత



**చౌటుప్పల్, క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ లో రైతులకు విశ్రాంతి భవనము, వాటర్ ట్యాంక్ నిర్మాణం, బోర్ వెల్, మార్కెట్ యార్డ్ లో సిసి నిర్మాణం ఏర్పాటు, సిసి రిపేరు, నూతన కార్యాలయ భవనమును ఏర్పాటు చేయవలసిందిగా కోరుతూ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య ఆధ్వర్యంలో వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, డైరెక్టర్లు కలిసి మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి శనివారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ... చౌటుప్పల్ మార్కెట్ యార్డులో దాదాపు 20 సంవత్సరాల క్రితం సుమారుగా 15,000 వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్ నిర్మాణం ఏర్పాటు చేశారని ఇప్పుడు అది రిపేర్ కి వచ్చిందని తెలిపారు. మార్కెట్ యార్డ్ కు రైతులు ఎక్కువ సంఖ్యలో రావడం వలన తాగునీరు సరిపోవటం లేదు కాబట్టి, రైతుల సౌకర్యార్థం 40,000 లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్ తో పాటు బోర్ వెల్ ను నిర్మించాల్సిన అవసరం ఉందని తెలిపారు. అంతేకాకుండా చౌటుప్పల్ మార్కెట్ పరిధిలోని పిలాయిపల్లి కాలువ వలన రైతులు ధాన్యం పంటను అధికంగా పండించడం వల్ల మార్కెట్ యార్డ్ కు అధికంగా ధాన్యం వస్తుంది కావున మార్కెట్ యార్డ్ లో ఉన్నటువంటి భూమిపై ఉన్న సిసి ఫ్లోర్ సరిపోవడం లేదని కాబట్టి నూతనంగా సిసి నిర్మాణం అవసరం ఉందని తెలిపారు. అంతేకాకుండా మార్కెట్ యార్డులో గతంలో వేసిన సిసి కి గుంతలు పడి ఉండడం వలన దానికి రిపేర్ చేయించవలసిన అవసరం ఉందని తెలిపారు. చౌటుప్పల్ మార్కెట్ యార్డులో రైతులకు విశ్రాంతి భవనం లేక చాలా ఇబ్బందులు పడవలసి వస్తున్నందున ప్రస్తుతం ఉన్న కార్యాల భవనం ను రైతు విశ్రాంతి భవనముగా మార్పు చేసి వ్యవసాయ మార్కెట్ కమిటీ సిబ్బందికి, మార్కెట్ పాలకవర్గానికి నూతన భవన నిర్మాణం ఏర్పాటు చేయవలసి అవసరం ఉన్నదని వీటిని మంజూరు చేయవలసిందిగా వినతి పత్రం ద్వారా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని కోరారు. కార్యక్రమంలో చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు తదితరులు ఉన్నారు.



## పేద మధ్యతరగతి విద్యార్థులకు అందుబాటులో ప్రో బెల్స్ గార్డెన్ పాఠశాల

### గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా విద్యార్థులకు అవార్డుల పంపిణీ

### విద్యార్థులను ప్రోత్సహించేందుకు అవార్డుల ప్రధానం ప్రిన్సిపాల్ పి శ్రీధర్

**క్రైమ్ మిర్రర్, మల్కాజ్ గిరి:** విద్యార్థులకు చదువుతోపాటు వారికి ఆసక్తి ఉన్న రంగంలో ప్రతిభ కనబరిచేందుకు తమ పాఠశాల ఉపాధ్యాయులు అన్ని రకాలుగా సహకరిస్తామని ప్రొబే ల్స్ గార్డెన్ పాఠశాల ప్రిన్సిపాల్ పి శ్రీధర్ పేర్కొన్నారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులకు అవార్డులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీధర్ మాట్లాడుతూ పేద మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో పాఠశాల నడిపిస్తూ ఎన్నో ఏళ్లుగా వారి నమ్మకాన్ని చూరగొనమని తెలిపారు. పాఠశాలలో విద్యతోపాటు క్రీడలు విద్యార్థులకు నైపుణ్యమున్న రంగాలలో వారిని ప్రోత్సహిస్తూ ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు తమకు నైపుణ్యం రంగంలో రాణించినప్పుడే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని తెలిపారు. 2024 25 కు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి అని తెలిపారు. అన్ని వసతులు కలిగిన తమ పాఠశాలలో విద్యార్థులను చేర్పించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన రెండవ తరగతి విద్యార్థిని బద్దుల దివ్యాంక యాదవ్ కు ఈ సందర్భంగా అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




## మావోయిస్టులపై కాల్పులు విరమించి చర్చలు జరపాలి

### మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి




క్రైమ్ మిర్రర్, మిర్యాలగూడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టులపై కాల్పులు విరమించి చర్చలు జరపాలని మాజీ ఎమ్మెల్యే, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. శనివారం మిర్యాలగూడ ప్రజా సంఘాల ఐక్యవేదిక, ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక, వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం కర్రెగుట్టపై డీఆర్జీ, సీఆర్పీఎఫ్, బస్తర్‌ఫైటర్స్ బలగాలను కాల్పులు విరమించి వెనక్కి రప్పించాలన్నారు. మధ్యభారతంలో అమాయకులైన వందలాది మంది ఆదివాసీలను కేంద్ర బలగాలు చంపడం నిలిపివేయాలన్నారు. మావోయిస్ట్ పార్టీ కాల్పులు విరమించి చర్చలకు సిద్ధమైనందున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్చలు జరపాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య, మట్టిమనిషి వేనేపల్లి పాండురంగారావు, సీహెచ్.సుధాకర్‌రెడ్డి, ప్రజాసంఘాల ఐక్య వేదిక నాయకులు రామయ్య, టిటిఎఫ్ నాయకులు కస్తూరి ప్రభాకర్, ముస్లిం విద్యావంతుల వేదిక కన్వీనర్ మౌజంహుస్సేన్,కిరణ్మయి, సీపీఐఎంఎల్ నాయకులు జ్వాలా వెంకటేశ్వర్లు, డాక్టర్ జే.రాజు,డిటీఎఫ్ నాయకులు భిక్షమయ్య, తెలంగాణ ఉద్యమ నేత నారాయణరెడ్డి, హాఫీజ్, పాల్గొన్నారు.



## ఛలో వరంగల్: బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేద్దాం

### మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు

క్రైమ్ మిర్రర్, మిర్యాలగూడ: భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) రజతోత్సవ బహిరంగ సభను ఘనంగా నిర్వహించేందుకు మిర్యాలగూడలో ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. పట్టణంలోని రెడ్డికాలనీ బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం పార్టీ ప్రముఖుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించబడింది. ఈ సందర్భంగా మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీ 25వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నేతృత్వంలో ఎల్కతుర్తి క్రాస్ రోడ్డు వద్ద భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అన్ని విధాలుగా విజయవంతం చేయాల్సిన అవసరం ఉందని, మిర్యాలగూడ నుంచి పెద్ద సంఖ్యలో క్యాడర్ తరలివెళ్లాలని పిలుపునిచ్చారు. సభ విజయవంతంపై చర్చిస్తూ నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలతో తగిన ప్రణాళికలు రూపొందించామని భాస్కర్ రావు వెల్లడించారు. ఈ సమావేశంలో యడవెల్లి శ్రీనివాస రెడ్డి, అన్నబీమోజు నాగార్జునచారి, నల్లమోతు సిద్దార్థ్, ఎండి. మక్దూమ్ పాషా, మాజీద్, షెహనాజ్ బేగం, పిన్నబోయిన శ్రీనివాస్ యాదవ్, ఎండి. ఇలియాస్ ఖాన్, తలకొల శ్రీధర్ రెడ్డి, సాధినేని శ్రీనివాస్ రావు, కుందూరు శ్యామ్ సుందర్ రెడ్డి, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతు గా నిలుస్తున్నారు



**చిట్యాల క్రైమ్ మిర్రర్:** యావత్ తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం కి పూర్తి మద్దతుగా నిలుస్తున్నారని మాజీ ఏఎంసీ చైర్మన్ కాటం వెంకన్న, మండల కాంగ్రెస్ అధ్యక్షులు గుడిపాటి లక్ష్మీనరసింహ అన్నారు చిట్యాల పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇరువురు మాట్లాడుతూ తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతుగా నిలుస్తూ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను చూసి హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోవడంతో విచక్షణ కోల్పోయి మాట్లాడుతున్నారని ఇలాంటి చర్యలు మానుకోకపోతే ప్రజలే తగిన గుణపాఠం చెప్తారని అన్నారు. అసలు బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవాలు విజయవంతం చేయాలని అంటుంది కానీ ఈ రజితోత్సవ వేడుకలు టిఆర్ఎస్ పార్టీ వా లేక బిఆర్ఎస్ పార్టీవా అని ఎద్దేవా చేశారు. అసలు బిఆర్ఎస్ పార్టీ తమ ఉనికిని కాపాడుకోవడానికి ఈ వేడుకలు పెట్టుకుందని విమర్శించారు. రాష్ట్ర సాధన కోసం పోరాటం చేసిన ఉద్యమకారులను కళాకారులను అవమానించిన ఘనత బిఆర్ ఎస్ పార్టీదే అని,కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఉద్యమకారుల పై కేసులు ఎత్తివేసే విధంగా ఎంతో కృషి చేసి ఉద్యమకారులకు కళాకారులకు అండగా నిలబడ్డాడని తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటినుండి నేటి వరకు అనేక సంక్షేమ పథకాలు చేపట్టిందని అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నట్టు తెలిపారు. రుణమాఫీ,ఆరోగ్యశ్రీ పెంపు,సన్నబియ్యం పంపిణీ, ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు,రైతుబంధు రైతు భరోసా, 500లకే గ్యాస్ సిలిండర్,మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,ఇలా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుంటే ఓర్వలేని బిఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం తగదని అన్నారు. పెరేపల్లి మాజీ సర్పంచ్ అంతటి వెంకటేష్ గౌడ్,ఏఎంసీ డైరెక్టర్ కోనేటి యాదగిరి, నాయకులు అద్దెల లింగారెడ్డి, పల్లపు బుద్ధుడు, ఏపూరు మాజీ ఉపసర్పంచ్ లింగస్వామి, కాటం సత్తయ్య, తాళ్ల వెల్లంల గ్రామ శాఖ అధ్యక్షులు సైదులు,యాకారి లింగస్వామి,గోపగోని నరసింహ,తదితరులు పాల్గొన్నారు.



## పాకిస్థాన్ వాళ్ళను అరెస్టు చేయాలని బీజేపీ నాయకుల పిర్యాదు

**మునుగోడు క్రైమ్ మిర్రర్ :** దేశ భద్రత విషయంలో అనుచిత వ్యాఖ్యలు చేసే వారిని ఉపేక్షించొద్దు అని బీజేపీ మండల అధ్యక్షుడు పెంబళ్ల జానయ్య ఆధ్వర్యములో పోలీసులకు పిర్యాదు చేశారు.. భవనం మధుసూదన్ రెడ్డి,ముంగి ధనంజయ గౌడ్ ,మాధగోని నరేందర్ గౌడ్, పగిళ్ల భిక్షం,బొబ్బిలి యాదయ్య పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
విలేకరులు కావలెను
క్రైమ్ మిర్రర్ తెలుగు దినపత్రికలో
పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు,
నియోజకవర్గం, మండలాలవారీగా
అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను.
ఆసక్తిగలవారు ఈ క్రింది
నెంబరుకు సంప్రదించగలరు.
9393446188





# పహల్గామ్ ఉగ్రదాడి అమరులకు మిర్యాలగూడలో నివాళులు

## బీఎల్ఆర్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ

క్రైమ్ మిర్రర్, మిర్యాలగూడ : కాశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రవాద దాడిలో మృతి చెందిన పర్యాటకులకు నివాళులు అర్పిస్తూ, ఉగ్రవాదంపై నిరసనగా మిర్యాలగూడలో శనివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని స్థానిక శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) ఆధ్వర్యంలో చేపట్టారు. సాయంత్రం 6:45 గంటలకు మండల పరిషత్ కార్యాలయం ఆవరణ నుండి ప్రారంభమైన ర్యాలీ, ఎన్ఎస్పీ క్యాంపులోనీలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద రాత్రి 8 గంటలకు ముగిసింది. సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో సాగిన ఈ ర్యాలీలో జాతీయ పతాకాలు, డిజిటల్ కొవ్వొత్తులతో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, బీసీ సంఘాలు, రెడ్డి సంక్షేమ సంఘం, మాలమహానాడు, ఎమ్మార్పీఎస్, ముస్లింలు, సిక్కులు, దళితులు తదితర సంస్థల ప్రతినిధులు దేశ సమైక్యత, మతసామరస్యంపై నినాదాలు చేశారు. "ఉగ్రవాదం నశించాలి", "దేశద్రోహులారా ఖబర్దార్", "పాకిస్తాన్ క్షమించరాదు" వంటి నినాదాలు ర్యాలీని కుదిపేశాయి. ఈ కార్యక్రమంలో నల్లగొండ అదనపు కలెక్టర్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ఎం. నారాయణ్ అమిత్, డీఎస్పీ కె. రాజశేఖర్ రాజు, మున్సిపల్ కమిషనర్ ఎండి. యూసుఫ్, టౌన్ ఇన్స్పెక్టర్లు మోతిరాం, సోమనర్సయ్య, పి.ఎన్.డి. ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు, బీఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.





## ఉగ్రదాడిని ఖండిస్తూ ఫోటో, వీడియో గ్రాఫర్ ల నిరసన ర్యాలీ

**చౌటుప్పల్, క్రైమ్ మిర్రర్:** జమ్మూ కాశ్మీర్ లోని పహల్ గావ్ లో టూరిస్టులపై జరిగిన ఉగ్ర దాడిని ఖండిస్తూ చౌటుప్పల్ లో ఫోటో, వీడియో గ్రాఫర్ల మండల అధ్యక్షులు తొర్పునూరి సాయిలు ఆధ్వర్యంలో శనివారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి తమ నిరసనను వ్యక్తం చేశారు. మతం మత్తులో పహల్ గావ్ లో 28 మంది టూరిస్ట్ లను చంపి ఉగ్రవాద చర్యలకు పాల్పడిన వారిని తీవ్రంగా శిక్షించాలని అన్నారు. ఉగ్రవాదుల దాడులలో చనిపోయిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ చౌటుప్పల్ బస్టాండ్ నుండి తంగడపల్లి చౌరస్తా వరకు జాతీయ రహదారిపై ఫోటో, వీడియో గ్రాఫర్ లు నిరసన ర్యాలీలో పాల్గొన్నారు. ఇటువంటి చర్యలు మరోసారి పునరావృతం కాకుండా వారిపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో బిజెపి మునుగోడు అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షం గౌడ్, యాదాద్రి భువనగిరి ఫోటోగ్రఫీ జిల్లా ఉపాధ్యక్షులు యజ్ఞమాచారి, జిల్లా సహాయ కార్యదర్శి కాటంరాజు గౌడ్, మండల కోశాధికారి వనం రుషి, మండల సహాయ కార్యదర్శి రోషన్న గారి రాఘవేంద్ర గౌడ్, టీవీ5 రిపోర్టర్ మల్లేష్ గౌడ్, ఊడుగు రమేష్ గౌడ్, కందగట్ల కృష్ణ, మెట్టు రామచంద్రారెడ్డి, కత్తుల రవి, బొడిగె ప్రభాకర్, కత్తుల ప్రవీణ్, ఇటుక మల్ల మహేందర్, నల్లెంకి మహేష్, లక్కు సతీష్, శ్రీ వాసు బాబా, మధు,శివ, డ్రోన్ శివకుమార్ చారి, దేశగోని రాజు, పల్లెర్ల సుజిక్, చేకూరి రాజు, చిదుగుళ్ళ నవీన్, రుద్ర సంతోష్, తీరందాసు రమేష్, బోయ సంపత్, చెరుకు పవన్, బుంగ వంశీ, పందు నిఖిల్ చారి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సందీప్ జన్మదిన వేడుకలు



నిజాంపేట్, క్రైమ్ మిర్రర్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ రెండవ డివిజన్ నాయకుడు సందీప్ జన్మ దినం సందర్భంగా శనివారం డివిజన్ నాయకులు శాలువాతో సన్మానించి కేక్ కట్ చేపించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు బొట్ల తిరుపతి, గణపతి రావు, శరత్ రెడ్డి, శ్రీ సాయి గౌడ్, వేముల శ్రీనివాస్, మెరుగు రమేష్, విజయ భాస్కర్ రెడ్డి, శివరామకృష్ణ, జానకిరామ్, తోట శ్రీకాంత్, రాం పుల్లారెడ్డి, బి ఆర్ ఎస్ పార్టీ రెండో డివిజన్ మహిళా అధ్యక్షులు పద్మా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలి

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం చేసిన రాంచందర్ రత్నం

చేవెళ్ల (క్రైమ్ మిర్రర్):మొయినాబాద్ మండలం మోత్కుపల్లి గ్రామానికి చెందిన తలారి రవి సతీమణి సంతోష మృతి చెందారు.గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రాంచందర్ రత్నం మృతురాలికి సంతాపం ప్రకటించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి దిగ్భ్రాంతిని వ్యక్తపరిచారు. శనివారం మృతురాలి కుటుంబానికి రూ.7,500 ఆర్థిక సాయం అందజేసి భాసటగా భరోసానిచ్చారు.ఈ కార్యక్రమంలో చంద్రమౌళి,సత్తయ్య, చంద్రయ్య,రాజు,జంగయ్య,హరి,శ్రీను,రాజు,అంతయ్య,రాంచందర్,శేఖర్,కిరణ్ గ్రామస్తులున్నారు.



## పాకిస్తాన్ ప్రేమికులను పట్టుకొని పాకిస్తాన్ కు పంపండి



**చౌటుప్పల్, క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో చౌటుప్పల్ ఎస్ హెచ్ ఓ ను కలిసి ఈనెల 22న జమ్మూ కాశ్మీర్ లో జరిగిన సంఘటన ఇకముందు మన భారత్ లో జరగకుండా దేశవ్యాప్తంగా భారత్ లో పాకిస్తాన్ పౌరులు ఎవరు ఉన్న ఈ దేశం విడిచి వెళ్లిపోవాలని భారత ప్రభుత్వం ఆదేశంతో వెళ్ళిపోతున్న సంగతి అందరికీ తెలిసిందే, అదేవిధంగా ఈ దేశంలో ఉన్న పాకిస్తాన్ ప్రేమికులను కూడా వెతికి ఈ దేశం నుంచి పంపించాలని, వారు కనుక ఈ దేశంలో ఉంటే శత్రువు కన్నా ప్రమాదమని అన్నారు. కాబట్టి తక్షణమే వారిని అరెస్టు చేసి భారత్ నుండి పంపాలని భారతీయ జనతా పార్టీ కోరింది. ఈ కార్యక్రమంలో మునుగోడు అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షం గౌడ్, కైరంకొండ అశోక్ నేత, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, ఫక్కీరు శ్రీనివాస్ రెడ్డి, కట్ట కృష్ణ, పబ్బు వంశీ, గౌడ్, కడారి కల్పనా యాదవ్, పి వెంకటేశం గౌడ్, బిక్షపతి, తడక సురేఖ, దిండు భాస్కర్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 28న చలో కలెక్టరేట్

### సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద మహాధర్నాను జయప్రదం చేయండి



చౌటుప్పల్, క్రైమ్ మిర్రర్: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం లోని మందోళ్ళగూడెం, సింగరాయ చెరువు, తూర్పు గూడెం గ్రామాలలో ప్రజా సమస్యల సాధనకై ఏప్రిల్ 28న చలో కలెక్టరేట్ ముందు ధర్నా కరపత్రం విడుదల చేయడం జరిగింది. సిపిఐఎం జిల్లా కార్యదర్శి కార్యవర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి మాట్లాడుతూ... పాలకులు మారుతున్నా కానీ పాలన తీరు మారడం లేదని ప్రజా సమస్యలపై సమగ్ర ప్రణాళిక లేక అనేక సమస్యలు పెండింగ్ లో ఉన్నాయని అన్నారు. గ్రామాలలో నీటి సమస్యల ను పిల్లాయి పల్లి కాలువ ద్వారా చెరువులను, కుంటలను నింపాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధి కూలీలకు సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాలని కనీస వేతనం 6000 ఇవ్వాలని పని ప్రదేశంలో మౌలిక వసతులు, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని అన్నారు . కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు మాజీ ఎంపీటీసీ చెన్నబోయిన వెంకటేశం, సిపిఎం మండల కమిటీ సభ్యులు కొండ శ్రీశైలం, సిపిఎం శాఖ కార్యదర్శి ఇట్టబోయిన శేఖర్, మంద బుచ్చిరెడ్డి, నీల శ్రీను, యాట సుధాకర్, యాట ముత్యాలు, శంకరయ్య, చీమకండ్ల నరసింహ, శ్రీను, చప్పిడి, కృష్ణారెడ్డి, రాములమ్మ, యాట యాదయ్య, మల్లెబోయిన శివాజీ, నరేష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

### బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్ రెడ్డి



చేవెళ్ల (క్రైమ్ మిర్రర్):బీజేపీ మండల సమావేశం బీజేపీ మండలాధ్యక్షుడు మాధపురం శ్రీకాంత్ ఆధ్వర్యంలో హిమాయత్ నగర్ లోని కంజర్ల కన్వేన్షన్ సెంటర్ లో శనివారం జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.బీజేపీ బూత్ కమిటీలు,మండలం కమిటీలు స్థానిక ఎన్నికల్లో సత్తా చాటెందుకు సన్నద్ధం కావాలన్నారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలం అయిందన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ పై విశ్వాసం కొల్పోయి బీజేపీ పై ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందన్నారు.ఉగ్రవాదాన్ని అంతం చేయడానికి మోదీ ప్రభుత్వం రెడీగా ఉందని,భారత్ లో ఉన్న పాకిస్తానీలు వెంటనే ఇక్కడ నుండి వెళ్లిపోవాలని అన్నారు.మోదీ సర్కార్ తీసుకున్న నిర్ణయానికి అందరం కలిసికట్టుగా నడవాలని ఉగ్ర దాడిలో మరణించిన వారికి నివాళులు అర్పించారు.ఈ సమావేశంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే రత్నం,రాష్ట్ర సీనియర్ నాయకుడు అంజన్ కుమార్,రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాష్,రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ప్రభాకర్ రెడ్డి,చేవెళ్ల అసెంబ్లీ కన్వీనర్ ప్రతాప్ రెడ్డి,గోపాల్ రెడ్డి,చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్,నర్సింహా రెడ్డి,జిల్లా నాయకులు, మండల నాయకులు,బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

## పహాడీ షరీఫ్ పోలీస్ స్టేషన్ సమీపంలో వాహన తనిఖీలు

### ట్రాఫిక్ నిబంధనాలను పాటించి,సరైన పత్రలు లేకుండా వాహనాలు నడపరాదు ం సి ఐ గురువా రెడ్డి



**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్) :** మహేశ్వరం నియోజకవర్గం పహాడీ షరీఫ్ పోలీస్ స్టేషన్ సమీపంలో శనివారం ఆకస్మిత వాహన తనిఖీలు చేసిన పహడి షరీఫ్ సీఐ గురువారెడ్డి, పోలీసు సిబ్బంది తుక్కుగూడ వైపు నుండి హైదరాబాద్ వెళ్తున్న కార్లు, ద్విచక్ర వాహనాలను ఆపి తనిఖీలు చేసి వాహనాలకు సరైన పత్రాలు చూసి,కార్లను ,ద్విచక్ర వాహనాలను తనిఖీలు చేసి పంపిస్తున్న పోలీసులు. ఈ సందర్భంగా సిఐ గురువారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ,వాహనాలకు సంబంధించిన పత్రాలను వెంటనే పెట్టుకోవాలని సూచించారు,ఈ కార్యక్రమంలో పహాడీ షరీఫ్ ఎస్ ఐ లు,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# లిక్కర్ కేసులో సిట్ దూకుడు

### సజ్జల శ్రీధర్ రెడ్డికి ఏసీబీ కోర్టు రిమాండ్

**విజయవాడ, (క్రైమ్ మిర్రర్):** మద్యం కుంభకోణంలో ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్ యజమాని సజ్జల శ్రీధర్ రెడ్డికి వచ్చే నెల ఆరో తేదీ వరకు ఏసీబీ కోర్టు రిమాండ్ విధించింది. శనివారం ఉదయం విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యపరీక్షలు ముగిసిన అనంతరం శ్రీధర్ రెడ్డిని ఏసీబీ కోర్టులో సిట్ అధికారులు హాజరుపరిచారు. ఈ కేసుపై ఏసీబీ కోర్టు విచారణ చేపట్టింది. విచారణలు ముగిసిన అనంతరం శ్రీధర్ రెడ్డికి ఏసీబీ కోర్టు రిమాండ్ విధించింది. కాగా.. వైసీపీ ప్రభుత్వంలో మద్యం కుంభకోణం వెలుగు చూసింది. ఈ స్కాంపై ఏపీ ప్రభుత్వం సీరియస్‌గా విచారణ చేపట్టింది. ఈ కేసు విషయంలో సిట్ అధికారులు వేగంగా దర్యాప్తు జరుపుతున్నారు. ఇప్పటికే ఇదే కేసులో రాజ్ కసిరెడ్డిని అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఈ స్కాంలో ఎవరున్నా విడిచి పెట్టవద్దని ఏపీ ప్రభుత్వం పోలీసులను ఆదేశించింది. దీంతో సిట్ అధికారులు ఈ కేసు విషయంలో దూకుడు పెంచారు. ఈ క్రమంలోనే మద్యం కుంభకోణంలో మరో కీలక వ్యక్తి సజ్జల శ్రీధర్ రెడ్డిని ని(శుక్రవారం) సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. సిట్ అధికారులకు వచ్చిన సమాచారం మేరకు శ్రీధర్ రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. ఈ రోజు(శనివారం) తెల్లవారుజామున విజయవాడకు అధికారులు తరలించారు. మద్యం కుంభకోణంలో కమీషన్ల వ్యవహారంలో సజ్జల శ్రీధర్ రెడ్డి కీలక పాత్ర పోషించినట్లు- సిట్ అధికారులు గుర్తించారు. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మద్యం విధానం మార్పు, కమిషన్లు, లోకల్ బ్రాండ్లపై జరిగిన సమావేశాల్లో సజ్జల శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు. ఇదే విషయాన్ని మీడియాకు మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి కూడా చెప్పారు. కర్నూలులో స్పై డిస్టలరీను స్వాధీనం చేసుకుని మద్యం తయారీ చేయించారనే ఆరోపణలు సజ్జల శ్రీధర్ రెడ్డిపై ఉన్నాయి.

# మాజీ ఎంపి బుట్టా రేణుకకు ఎల్ఐసి షాక్

### రుణాల రికవరీకి ఆస్తుల వేలానికి సిద్ధం

**కర్నూలు, (క్రైమ్ మిర్రర్):** ప్రభుత్వ రంగ జీవిత బీమా సంస్థ ఎల్ఐసీకి అనుబంధ విభాగం ఎల్ఐసీ హెచ్ఎఫ్ఎల్ నుంచి రూ.310 కోట్లు అప్పును తీసుకున్న కేసులో వైసీపీ మాజీ ఎంపీ బుట్టా రేణుక దంపతుల నుంచి రికవరీకి రంగం సిద్ధం అయ్యింది. తీసుకున్న అప్పుడు ఈ దంపతులు తిరిగి చెల్లించ లేదు. దీంతో వారి ఆస్తులను వేలం వేసే దిశగా సంస్థ అడుగులు వేస్తోంది. కొంత కాలం పాటు కిస్తీలు సక్రమంగానే వీరు చెల్లించారు. కానీ గత ఐదేళ్లగా వీరు ముఖం చాటేశారు. సంస్థ ప్రతినిధులు పలుసార్లు నోటీసులు పంపి.. వారితో చర్చించినా లాభం లేకుండా పోయింది. దీంతో వారి ఆస్తులను వేలం వేసేందుకు ఎల్ఐసీ చర్యలు చేపట్టింది. బుట్టా రేణుక, ఆమె భర్త నీలకంఠలు 2018లో 15 ఏళ్ల కాలవ్యవధిలో తిరిగి చెల్లించేలా రూ.310 కోట్ల రుణం తీసుకున్నారు. బుట్టా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్, బుట్టా కన్వెన్షన్ సర్వీసెస్ లిమిటెడ్, మెరిడియన్ ఎడ్యుటెక్ సర్వీసెస్ కార్యకలాపాలకు ఆ రుణాన్ని వినియోగించారు. ఈ రుణంపై సుమారు రూ.40 కోట్ల వరకు చెల్లించారు. అసలు,వడ్డీ కలిపి ఇంకా రూ. 340 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది. వడ్డీ భారం ఎక్కువగా ఉన్నందున కొన్ని ఆస్తులు విక్రయించి రుణం రీషెడ్యూలు చేయాలని వారు కోరారు. కానీ నిబంధనలకు విరుద్ధంగా ఈ ప్రతిపాదన ఉందని హెచ్ఎఫ్ఎల్



ప్రతినిధులు అంగీకరించ లేదు. ఆ క్రమంలో పలు ప్రతిపాదనలను సంస్థ ప్రతినిధుల ఎదుట ఆ దంపతులు ఎదుట ఉంచారు. అందుకు వారు సమ్మతించలేదు. దీంతో బుట్టా రేణుక దంపతులకు చెందిన బంజారాహిల్స్‌లోని ఐదువేల గజాల ఆస్తిని రూ.145 కోట్లకు వేలం వేయగా ఎవరూ ముందుకు రాలేదు. మాదాపూర్‌లోని 7,205 చ.గజాల్లో ఉన్న బుట్టా కన్వెన్షన్ వేలానికీ సైతం స్పందన లేదు. ఈ నేపథ్యంలో ఈ ఆస్తులను మరోసారి వేలానికీ ప్రయత్నిస్తున్నారు. వీరి ఆస్తులను కొనుగోలు చేస్తే భవిష్యత్తులో ఏమైనా ఇబ్బందులు తలెత్తే అవకాశముందని భయంతో ఎవరు ముందుకు రావడం లేదనే ఓ చర్చ సైతం సాగుతోంది.

# అహ్మదాబాద్‌లో పోలీసుల విస్తృత గాలింపు

**400 మందికి పైగా అనుమానాస్పదుల గుర్తింపు**

**వారిలో 127మంది అక్రమ బంగ్లాదేశీయులు**

గాంధీనగర్,ఏప్రిల్26(ఆర్ఎన్ఎ): జమ్మూ కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది మరణించిన నేపథ్యంలో భారత్ ప్రభుత్వం అప్రమత్తమైంది. అందులోభాగంగా దేశంలోని అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. ఈ నేపథ్యంలో గుజరాత్‌లోని అహ్మదాబాద్ నగరవ్యాప్తంగా శనివారం క్రైమ్ బ్రాంచ్ అధ్వర్యంలో ముమ్మర తనిఖీలు, సోదాలు నిర్వహించింది. అందులోభాగంగా 400 మందికిపైగా అనుమానాస్పద వలసదారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని విచారించారు. వీరిలో 127 మంది బంగ్లా దేశీయులు అక్రమంగా దేశంలో నివసిస్తున్నట్లు గుర్తించారు. విచారణ అనంతరం వారి వారి ప్రాంతాలకు వెళ్లాలని ఆదేశించామని అహ్మదాబాద్ - బ్రాంచ్ డీసీపీ అజిత్ రాజియన్ వెల్లడించారు. అహ్మదాబాద్ నగరంలో అక్రమంగా నివసిస్తున్న విదేశీ వలసదారులను పట్టుకోవడానికి ఈ కూంబింగ్ ఆపరేషన్ నిర్వహించినట్లు డీసీపీ సోదాహరణంగా వివరించారు.జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి జరిగింది. దీంతో భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో ఇరు దేశాలు పోటా పోటీగా కీలక నిర్ణయాలు తీసుకుంటున్నాయి. అలాంటి వేళ దేశంలోని వివిధ రాష్ట్రాల్లో నివసిస్తున్న పాకిస్థాన్ జాతీయులను వెంటనే వెనక్కి పంపాలని కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకొంది. దాంతో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా.. శుక్రవారం దేశంలోని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయారాష్ట్రాల్లో నివసిస్తున్న అక్రమ వలసదారులు మరి ముఖ్యంగా పాకిస్థానీయులను గుర్తించి.. వారిని వెంటనే పాకిస్థాన్ పంపాలని వారిని ఆదేశించారు.

# పహల్గాం దాడితో మాకు సంబంధం లేదు

### మేము ఆ ఘాతుకానికి పాల్పడలేదు

### తీవ్రనిరసనలతో నాలుక మడతేసిన ది రెసిస్టెన్స్ ఫ్రంట్

**శ్రీనగర్, (క్రైమ్ మిర్రర్):** పహల్గాం దాడిపై కశ్మీర్‌లో నిరసనలు మిన్నంటాయి. టెర్రిస్టుల చర్యలపై ఇస్పుడు స్థానికులు తీవ్రంగా మండిపడుతున్నారు. తమ పొట్ట కొట్టారని, పచ్చిన కాశ్మీర్‌లో చిచ్చు పెట్టారని విమర్శలు చేస్తున్నారు. అమాయక టూరిస్టులను బలితీసుకోవడాన్ని కశ్మీర్ సమాజం ముక్త కంఠంతో ఖండించింది. ఈ నేపథ్యంలో లష్కరే తయ్యబా అనుబంధంగా కశ్మీర్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఉగ్రవాద బృందం 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' ఊహించని యూటర్న్ తీసుకుంది. పహల్గాం దాడి తామే చేశామని తొలుత ఘనంగా ప్రకటించిన టీఆర్ఎఫ్.. ఇప్పుడు తమకు ఆ దాడితో ఏమాత్రం సంబంధం లేదంటూ తాజాగా ప్లేటు ఫిరాయించింది. హ్యాకర్ల కారణంగా ఈ ప్రకటన విడుదలైందని, దీని వెనుక భారత సైబర్ ఇంటెలిజెన్స్ వర్గాలు ఉండొచ్చని కూడా పేర్కొంది. పహల్గాం దాడిలో మా పాత్ర అసలేమీ లేదు. దీన్ని మాకు ఆపాదించడం తప్పే కాకుండా తొందర పాటు చర్య అవుతుంది. తొలి ప్రకటనపై మేము అంతర్గత ముదింపు నిర్వహించాము. మా డిజిటల్ వేదికలపై సైబర్ దాడితో ఈ ప్రకటన వెలువడిందని గుర్తించాము. మా అనుమతి లేకుండా విడుదలైన ప్రకటన ఇది. సైబర్ దాడి ఎలా జరిగిందో తెలుసుకునేందుకు పూర్తిస్థాయి విచారణ ప్రారంభించాము. అయితే, ప్రాథమిక ఆధారాలు మాత్రం భారతీయ సైబర్



ఇంటెలిజెన్స్ వర్గాలవైపు చూపిస్తున్నాయని అంటూ ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ వాదనను బలపరిచేందుకు ఓ ఆడియో క్లిప్‌ను కూడా రిలీజ్ చేసింది. పహల్గాంలో 26 మంది అమాయక టూరిస్టుల హత్యకు తామే కారణంటూ టీఆర్ఎఫ్ తొలుత గర్వంగా ప్రకటించుకున్న విషయం తెలిసిందే. దీంతో, కశ్మీర్ ప్రజల్లో ఆగ్రహావేశాలు మిన్నంటాయి. పాకిస్థాన్‌పై, పాక్ ప్రేరేపిత ఉగ్రమూకలపై స్థానికుల్లో ఆగ్రహం పెల్లుబికింది. 2023లో భారత ప్రభుత్వం టీఆర్ఎఫ్‌ను ఉపా చట్టం కింద ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది. చొరబాట్లను ప్రోత్సహించడం, మిలిటెంట్లను చేర్చుకోవడం, పాక్ నుంచి ఆయుధాలు, మాదకద్రవ్యాల స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నారంటూ టీఆర్ఎఫ్‌ను టెర్రరిస్టు సంస్థగా ప్రకటించింది. మరోవైపు, పహల్గాం దాడి తరువాత ప్రపంచదేశాలు భారత్‌కు మద్దతు ప్రకటించాయి.

# యూఎస్ విద్యార్థులకు భారీ ఊరట

### కోర్టు మొట్టికాయలతో వీసా రద్దు నిర్ణయం వెనక్కి

**వాషింగ్టన్, (క్రైమ్ మిర్రర్):** ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లి బహిష్కరణ ముప్పు ఎదుర్కొంటున్న వందల మంది విద్యార్థులకు భారీ ఉపశమనం లభించింది. వారి వీసాలు/చట్టబద్ధ హోదాను రద్దు చేస్తూ ఇటీవల తీసుకున్న నిర్ణయంపై ట్రంప్ సర్కారు వెనక్కి తగ్గింది. ప్రధానంగా ఇటీవల కోర్టు ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుపట్టింది. నిర్ణయాన్ని రద్దు చేసింది దీంతో ట్రంప్ సర్కార్ ఆ విద్యార్థుల లీగల్ స్టేటస్‌ను పునరుద్ధరించింది. ఈమేరకు అమెరికా ప్రభుత్వానికి చెందిన ఓ న్యాయవాది తాజాగా వెల్లడించారు. వీసాలు రద్దయిన వారిలో కొంతమంది భారతీయ విద్యార్థులు కూడా ఉన్నట్లు సమాచారం. ట్రాఫిక్ ఉల్లంఘనలు వంటి చాలా చిన్న కారణాలతోనే వారి చట్టబద్ధ హోదాను తొలగించినట్లు అమెరికన్ ఇమిగ్రేషన్ లాయర్స్ అసోసియేషన్ పేర్కొంది. అక్రమ వలసదారులపై కఠినంగా వ్యవహరిస్తున్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. విదేశీ విద్యార్థులపైనా ఉక్కుపాదం మోపిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే వివిధ కారణాలతో 187 కాలేజీలకు చెందిన 1200




మందికి పైగా విదేశీ విద్యార్థుల వీసా లేదా వారి చట్టబద్ధ హోదాలను రద్దు చేసింది. దీంతో డిపోర్టేషన్, నిర్బంధం ముప్పు పొంచి ఉండటంతో ఆ విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. వీరిలో కొంతమంది ఇప్పటికే అమెరికాను వీడగా.. కొందరు రహస్య ప్రదేశాల్లో తల దాచుకున్నారు. ఇంకొందరు క్లాసులకు వెళ్లడం లేదు. తమ వీసాల రద్దుపై విద్యార్థులు న్యాయస్థానాలను ఆశ్రయించారు. కాలిఫోర్నియా, బోస్టన్ కోర్టుల్లో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ జరిపిన ఆయా న్యాయస్థానాలు.. విద్యార్థుల వీసా రద్దును ఆపాలంటూ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ క్రమంలోనే ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్.. ఆయా విద్యార్థుల చట్టబద్ధ హోదాను తాత్కాలికంగా పునరుద్ధరించింది. సాధారణంగా వీసా లేదా చట్టబద్ధ హోదా రద్దయినప్పుడు.. విదేశీ విద్యార్థుల వివరాలను పొందుపర్చే స్టూడెంట్ అండ్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ డేటాబేస్ నుంచి వారి వివరాలు తొలగిస్తారు. అయితే, ఈ రికార్డుల టెర్మినేషన్‌కు సంబంధించిన ట్రంప్ సర్కారు త్వరలోనే కొత్త పాలసీ తీసుకురానున్నట్లు తెలుస్తోంది. అప్పటివరకు తొలగించిన విద్యార్థుల రికార్డులన్నింటినీ తిరిగి యాక్టివేట్ చేస్తున్నట్లు- ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. దీంతో ఆయా విద్యార్థులకు చట్టబద్ధ హోదా లభిస్తుందన్నారు.

# జీవీఎంసీ డిప్యూటీ మేయర్‌పై నెగ్గిన అవిశ్వాసం

**జీవీఎంసీ డిప్యూటీ మేయర్ శ్రీధర్‌పై కూటమి ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం విజయం**

**74 మంది సభ్యుల మద్దతుతో తీర్మానం నెగ్గినట్లు కార్పొరేటర్ల వెల్లడి**

**విశాఖను అభివృద్ధి పథంలో నడిపిస్తామని కూటమి సభ్యుల ధీమా**

విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ)లో రాజకీయ పరిణామాలు వేగంగా మారాయి. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌పై కూటమి (టీడీపీ-జనసేన-బీజేపీ) కార్పొరేటర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం విజయవంతమైంది. ఈ పరిణామంతో కూటమి సభ్యులు సంబరాలు చేసుకున్నారు. డిప్యూటీ మేయర్ శ్రీధర్



అవినీతి, అరాచక పాలనకు చరమగీతం పాడామని వారు వ్యాఖ్యానించారు. అవిశ్వాస తీర్మానం నెగ్గిన అనంతరం కూటమి కార్పొరేటర్లు మీడియాతో మాట్లాడారు. గత నాలుగేళ్ల వైసీపీ పాలనలో విశాఖ నగరంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని ఆరోపించారు. కనీసం వీధి దీపాలు వెలిగించలేని, తాగునీటి సమస్యలు పరిష్కరించలేని దుస్థితి నెలకొందని విమర్శించారు. తమ అవిశ్వాస తీర్మానానికి 74 మంది సభ్యులు మద్దతు తెలిపారని, ఇది విశాఖ ప్రజల విజయమని అన్నారు. కొందరు వైసీపీ కార్పొరేటర్లు కూడా తమకు న్యాయం జరగలేదనే భావనతో, అభివృద్ధి కాంక్షించి అవిశ్వాసానికి మద్దతు పలికారన్నారు.గత పాలనలో జరిగిన అవినీతికి, అభివృద్ధి రాహిత్యానికి ఈ అవిశ్వాస విజయంతో ముగింపు పలికామని కూటమి కార్పొరేటర్లు పేర్కొన్నారు. రాబోయే కొద్ది కాలంలోనే విశాఖ నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించి చూపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. త్వరలోనే మేయర్, డిప్యూటీ మేయర్ పీఠాలను కూటమి కైవసం చేసుకుంటుందని, ప్రజలకు మెరుగైన పాలన అందిస్తామని వారు తెలిపారు.

# హర్యానాలో దారుణ ఘటన

### చిన్నారిని చంపి..తల్లిపై సామూభిక అత్యాచారం

**చండీగఢ్, (క్రైమ్ మిర్రర్):** రేపిస్టులు దారుణానికి ఒడిగట్టారు. బిడ్డను చంపి తల్లిపై సామూహిక అత్యాచారం చేసిన ఘటన హర్యానాలోని జీంద్‌లో కలకలం రేపింది. జరిగింది. గత మంగళవారం రాత్రి భర్త లేని సమయం చూసి గుడిసెలోకి నలుగురు దుండగులు చొరబడ్డారు. ముగ్గురు పిల్లలతో కలిసి నిద్రపోతున్న తల్లి పై దాడి చేశారు. ఆమెతోపాటు అయిదేళ్ల చిన్నారిని పక్కనే ఉన్న చెత్తకుప్ప వద్దకు ఎత్తుకెళ్లారు. అక్కడ చిన్నారి గొంతునులిమి హత్య చేసి చెత్త కుప్పలో పడేశారు. బాధితురాలిపై నలుగురూ అత్యాచారానికి పాల్పడ్డారు. తర్వాత అపస్మారక స్థితిలో ఉన్న మహిళను అక్కడే వదిలేసి పారిపోయారు. చిన్నారి మృతదేహం రాత్రంతా చెత్తకుప్పలోనే ఉంది. గురువారం స్పృహలోకి వచ్చిన మహిళ జరిగిన దారుణాన్ని పోలీసులకు వెల్లడించింది. నిందితుల్లో అమిత్ అనే వ్యక్తితోపాటు- ముగ్గురు మైనర్లు ఉన్నట్లు ఎస్.ఐ. యశ్వీర్ తెలిపారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది.

# తమిళనాట దారుణ టన


### వివాహేతర సంబంధంతో చిన్నారి హత్య

**చెన్నై, (క్రైమ్ మిర్రర్):** మ వివాహేతర సంబంధానికి అడ్డం వస్తోందని ఆగ్రహించిన ఓ తల్లి, ఆమె ముగ్గురు ప్రియులు రెండున్నరేళ్ల బాలికపై దాడి చేశారు. అంతటితో ఆగకుండా చిన్నారికి మద్యం తాగించి పడుకోబెట్టేందుకు యత్నించారు. దెబ్బలకు తాళలేక ఆ చిన్నారి మృతి చెందింది. తమిళనాడు తిరునల్వేలి జిల్లాలో జరిగిన ఈ ఘోరానికి సంబంధించిన వివరాలిలా వున్నాయి... దిసైవినై ద్వారంబట్టు ప్రాంతంలో శరత్, బృంద (25) అనే భార్యాభర్తలు నివసిస్తున్నారు. వేర్వేరు కులాలకు చెందిన వీరు నాలుగేళ్ల క్రితం ప్రేమించి పెళ్ళి చేసుకున్నారు. వీరికి దర్శిని (2) అనే కుమార్తె ఉంది. శరత్ కోవైలోని ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో బృంద కొంతమంది యువకులతో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ నేపథ్యంలో గత బుధవారం రాత్రి లింగసెల్వం, ముత్తుచుడర్, బెంజమిన్ అనే ముగ్గురు యువకులు బృందాను, ఆమె కుమార్తె దర్శినిని వాళతొట్టమ్ అనే ప్రాంతానికి తీసుకెళ్ళారు. ఆ తర్వాత దర్శినిని రోడ్డు పక్కనే కూర్చోబెట్టి బృందాతో గడిపేందుకు వెళ్లారు. ఆ సమయంలో చిన్నారి ఏడుస్తుండడంతో. తమకు అంతరాయం కలిగిస్తుందని ఆగ్రహించిన ముగ్గురు యువకులు, బృంద కలిసి ఆ చిన్నారి చేత బలవంతంగా మద్యం తాగించగా, కొద్దిసేపటికే ఆ చిన్నారి ప్రాణాలు విడిచింది. ఇంత జరిగినా ఏ మాత్రం దిగులు చెందని బృంద మరుసటి రోజు తన కుమార్తె అనారోగ్యంతో మృతి చెందినట్లు- నాటకమాడింది. భర్త, కుటుంబీకులు అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు బృందాను, ఆమె సన్నిహితులను తమదైన శైలిలో విచారించడంతో అసలు గుట్టురట్టయ్యింది. దీంతో ఆ నలుగురినీ పోలీసులు అరెస్టు చేశారు.

# శ్రీనగర్ నుంచి విమాన టిక్కెట్లు రద్దు

### వెనక్కి వచ్చేస్తున్న పర్యాటకులు

**శ్రీనగర్, (క్రైమ్ మిర్రర్):** కశ్మీర్ పర్యాటకం ఒక్క దెబ్బకు కుదేలవుతుంది. పహల్గావ్ ఘటనతో టూరిస్టులు వెనక్కి తగ్గుతున్నారు. కశ్మీర్ హోటళ్ళ నుంచి ఫ్యూచర్ క్రెడిట్ అవకాశాలు ఇచ్చాయి. ఇప్పుడు బుక్ చేసుకున్నవి వచ్చే సీజన్ వరకూ రిజర్వులో ఉంచుకునే అవకాశం కల్పించాయి. విమాన టికెట్లు రద్దు చేసుకుంటే మొత్తం సొమ్మును విమానయాన సంస్థలు తిరిగి ఇచ్చేస్తున్నాయి. విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు చేసిన ఏర్పాటుతో టూరిస్టులకు ఊరట లభించింది. ప్రత్యేక ఆఫర్లు ఇచ్చినా పర్యటకులు ఉండడానికి సిద్ధంగా లేమని అంటున్నారు . మరో మూడు నెలల వరకూ కశ్మీర్ పర్యాటకంలో నిస్తేజం తప్పదని స్థానికులు అంటున్నారు. అమర్‌నాథ్ యాత్రికులు సైతం వెనకడుగు వేస్తున్నారు. ఇదిలా ఉండగా.. పహల్గాం ఘటనలో ఏపీకి చెందిన చంద్రమౌళి మృతి చెందారు. బుధవారం రాత్రి చంద్రమౌళి మృత దేహానికి విశాఖ ఎయిర్ పోర్టులో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు నివాళులు అర్పించారు.



# హడలెత్తిస్తున్న ఇంటి అద్దె!.. నెలకు ఇన్ని లక్షలా..

భారతదేశంలో రియల్ ఎస్టేట్ మార్కెట్ బాగా పుంజుకుంటోంది. ముంబై, బెంగళూరు, హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో భూములు, అపార్ట్‌మెంట్ల ధరలు భారీగా ఉన్నాయి. అపార్ట్‌మెంట్స్ అద్దెలు కూడా ఈ నగరాల్లో అమాంతం పెరిగిపోతున్నాయి. ఇటీవల దీనికి సంబంధించిన ఒక పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. జైపూర్‌కు చెందిన ఉత్కర్ష్ గుప్తా.. తన ఎక్స్ ఖాతాలో కొన్ని ఫోటోలను షేర్ చేస్తూ ముంబైలో మాత్రమే ఇలాంటివి సాధ్యమవుతాయని పేర్కొన్నారు. ఇందులో 2 బీహెచ్‌కే హౌస్ అద్దె నెలకు రూ.1.35 లక్షలు. దీనికోసం రూ.400000 డిపాజిట్ చేయాలి అని ఉండటం చూడవచ్చు. ఇక్కడ గమనించదగ్గ మరో విషయం ఏమిటంటే.. వాషింగ్ మెషీన్ టాయిలెట్ గదిలోనే ఉండటం చూడవచ్చు. ప్రస్తుతం ఈ పోటోలు నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి. పలువురు నెటిజన్లు తమదైన రీతిలో కామెంట్స్ చేస్తున్నారు. ఒకరు ఇది బ్రిలియంట్ ఐడియా అని చెబుతుంటే.. మరొకరు ఇది బాత్‌రూమేనా అని అంటున్నారు. మరికొందరు దాని అద్దె కూడా చాలా ఎక్కువని చెబుతున్నారు. మొత్తానికి దీన్ని చూస్తే ముంబైలో అద్దెలు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

# ప్రత్యక్ష పన్నులపై రిఫండ్ ఎఫెక్ట్

**లక్ష్యాన్ని చేరని నికర కలెక్షన్లు**

**2024%-%25లో రూ. 22.37 లక్షల కోట్ల టార్గెట్**

**నికరంగా వసూలైనది రూ. 22.26 లక్షల కోట్లు**

**రికార్డు స్థాయిలో రూ. 4.76 లక్షల కోట్లు రిఫండ్**

న్యూఢిల్లీ: భారీ స్థాయిలో రిఫండ్‌లు జారీ చేయడంతో గత ఆర్థిక సంవత్సరంలో ప్రత్యక్ష పన్నుల వసూళ్లు నిర్దేశించుకున్న లక్ష్యం స్థాయిలో వసూలు కాలేదు. 2024%-%25లో నికరంగా రూ. 22.37 లక్షల కోట్లు టార్గెట్‌గా పెట్టుకోగా నికరంగా రూ. 22.26 లక్షల కోట్లు వసూలయ్యాయి. ఇది అంతక్రితం ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 13.57 శాతం అధికమే అయినప్పటికీ నిర్దేశిత లక్ష్యానికి మాత్రం చేరలేదు. గతేడాది జూలై నాటి బడ్జెట్‌లో రూ. 22,07,000 కోట్ల ప్రత్యక్ష పన్నుల వసూళ్లు నిర్దేశించుకోగా, దాన్ని ఈ ఏడాది ఫిబ్రవరిలో రూ. 22,37,000 కోట్లకు సవరించారు. సాధారణంగా కార్పొరేట్ ట్యాక్సులు, సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్‌టీటీ), నాన్%-%కార్పొరేట్ ట్యాక్సులు (గతంలో వ్యక్తిగత ఆదాయ పన్ను) మొదలైనవి ప్రత్యక్ష పన్నుల పరిధిలోకి వస్తాయి. వ్యక్తులు, సంస్థలు, హిందూ అవిభక్త కుటుంబాలు (హెచ్‌యూఎఫ్‌లు) మొదలైన వర్గాలు కట్టే పన్నులు నాన్%-%కార్పొరేట్ ట్యాక్సుల పరిధిలోకి వస్తాయి. అధికారిక డేటా ప్రకారం మార్చి 31తో ముగిసిన 2024%-%25 ఆర్థిక సంవత్సరంలో స్థూల ప్రత్యక్ష పన్నుల వసూళ్లు (రిఫండ్లకు ముందు) 15.59 శాతం పెరిగి రూ. 27.02 లక్షల కోట్లకు చేరాయి. అంతక్రితం 2023%-%24 ఆర్థిక సంవత్సరంలో ఇవి రూ. 23.37 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ఇక, రిఫండ్ల జారీ తర్వాత నికర ప్రత్యక్ష పన్నుల వసూళ్ల ప్రొవిజనల్ గణాంకాలు రూ. 22.26 లక్షల కోట్లుగా నమోదైయ్యాయి. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో నమోదైన రూ. 19.60 లక్షల కోట్లతో పోలిస్తే 13.57 శాతం పెరిగాయి. %-% ఇవన్నీ ప్రొవిజనల్ గణాంకాలు మాత్రమే. 2024%-%25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తుది దశ రీకన్సిలియేషన్, సర్దుబాట్లు జరుగుతున్నందున నికర వసూళ్లు మరికాస్త పెరగొచ్చని అధికారులు తెలిపారు.



# ఆఫీస్ స్పేస్ మార్కెట్లో హైదరాబాద్ జోరు

న్యూఢిల్లీ: కార్యాలయ వసతులకు (ఆఫీస్ స్పేస్) డిమాండ్ బలంగా కొనసాగుతోంది. దేశవ్యాప్తంగా ఆరు ప్రముఖ పట్టణాల్లో జూలై%-%సెప్టెంబర్ మధ్య 17.3 మిలియన్ చదరపు అడుగుల (ఎస్ఎఫ్‌టీ) స్థూల లీజింగ్ నమోదైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో లీజింగ్ పరిమాణం 13.2 మిలియన్ ఎస్ఎఫ్‌టీ కంటే 31 శాతం పెరిగినట్టు కొలియర్స్ ఇండియా విడుదల చేసిన డేటా స్పష్టం చేసింది. బెంగళూరు, హైదరాబాద్ మార్కెట్లలోనే సగం మేర లీజింగ్ నమోదు కావడం గమనార్హం.

**పట్టణాల వారీగా లీజింగ్**

- హైదరాబాద్ మార్కెట్లో ఆఫీస్ స్పేస్ లీజింగ్ సెప్టెంబర్ క్వార్టర్‌లో 16 శాతం పెరిగి రూ.2.9 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో స్థూల లీజింగ్ 2.5 మిలియన్ ఎస్ఎఫ్‌టీగా ఉంది.
- బెంగళూరులో 6.3 మిలియన్ ఎస్ఎఫ్‌టీ లీజింగ్ జరిగింది. ఒక త్రైమాసికం వారీగా అత్యధిక లీజింగ్ ఇదే కావడం గమనించొచ్చు. క్రితం ఏడాది ఇదే కాలంలో లీజింగ్ 3.4 మిలియన్ ఎస్ఎఫ్‌టీతో పోల్చితే 85 శాతం పెరిగింది.
- పుణెలో స్థూల ఆఫీస్ స్పేస్ లీజింగ్ 2.6 మిలియన్ ఎ స్ఎఫ్‌టీగా ఉంది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఒ క మిలియన్ ఎస్ఎఫ్‌టీ లీజింగ్ నమోదైంది.
- ముంబైలో 1.7 మిలియన్, చెన్నైలో 1.4 మిలియన్ ఎస్ఎఫ్‌టీ చొప్పున స్థూల లీజింగ్ జరిగింది.
- ఢిల్లీ ఎన్‌సీఆర్ మార్కెట్లో ఆఫీస్ లీజింగ్ క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 25%పెరిగి 2.4 మిలి యన్ ఎస్ఎఫ్‌టీకి చేరుకుంది. స్థూల లీజింగ్‌లో రెన్యువల్స్, ఆసక్తి వ్యక్తీకరణ లావాదేవీలను కలపలేదు.

**టెక్నాలజీ రంగం నుంచి డిమాండ్**

- జూలై %-%సెప్టెంబర్ కాలంలో నమోదైన స్థూల లీజింగ్‌లో 25 శాతం మేర టెక్నాలజీ రంగం నుంచే ఉన్నట్టు కొలియర్స్ ఇండియా డేటా తెలియజేసింది. ఆ తర్వాత బీఎఫ్ఎస్ఐ కంపెనీలు, ఫ్లెక్స్ స్పేస్ ఆపరేట్ల నుంచి లీజ్ ఒప్పందాలు అధికంగా జరిగాయి. "గడిచిన 2%-%3 ఏళ్లలో వివిధ రంగాలు, విభిన్న మార్కెట్లో ఆఫీస్ స్పేస్ లీజింగ్ ఎంతో ఆకర్షణీయంగా ఉంది. లీజింగ్ మార్కెట్ ఏటేటా కొత్త గరిష్టాలకు చేరుకుంటోంది. 2024లోనూ అధిక డిమాండ్, సరఫరా కనిపిస్తోంది"అని కొలియర్స్ ఇండియా ఆఫీస్ సర్వీసెస్ ఎండీ అర్పితా మల్హోత్రా తెలిపారు.
- హైదరాబాద్, బెంగళూరు, ముంబై మార్కెట్లలో ఈ ఏడాది మొదటి మూడు త్రైమాసికాల్లో (జనవరి%-%సెప్టెంబర్) ఆఫీస్ స్పేస్ డిమాండ్ 2023 మొత్తం డిమాండ్‌ను అధిగమించినట్టు చెప్పారు. సెప్టెంబర్ క్వార్టర్‌లో లీజు లావాదేవీల్లో రూ.లక్ష ఎస్ఎఫ్‌టీకి మించినవే 65 శాతంగా ఉన్నట్టు తెలిపారు.

# కియా ఈవీ9.. ధర రూ.1.3 కోట్లు




న్యూఢిల్లీ, అక్టోబర్ 3: దక్షిణ కొరియాకు చెందిన ఆటోమొబైల్ సంస్థ కియా..దేశీయ మార్కెట్‌కు మరో ఈవీని పరిచయం చేసింది. ఈవీ 9 పేరుతో విడుదల చేసిన ఈ కారు ధర రూ.1.3 కోట్లుగా నిర్ణయించింది. ఇప్పటికే సంస్థ రూ.61 లక్షల విలువైన ఈవీ 6ని విక్రయిస్తున్న విషయం తెలిసిందే. విదేశాల నుంచి దిగుమతి చేసుకొని ఇక్కడ తయారు చేస్తున్నవి ఈ రెండు మాడళ్లు. దీంతోపాటు రూ.63.9 లక్షల ధర కలిగిన కార్నివాల్ లిమౌసైన్ మాడల్‌ను కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ సందర్భంగా కియా ఇండియా ఎండీ, సీఈవో గ్వాంగులీ మాట్లాడుతూ%ొ%వచ్చే ఏడాది మాస్ సెగ్మెంట్‌లో తొలి ఈవీ కారును విడుదల చేయాలనుకుంటున్నట్లు చెప్పారు. 2030 నాటికి వార్షిక విక్రయాలు 4 లక్షల యూనిట్లు లక్ష్యంగా పెట్టుకున్న సంస్థ ఇందుకోసం మాస్ సెగ్మెంట్‌లో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని చూస్తున్నట్లు తెలిపారు.

# జీపే ద్వారా 'బంగారు' రుణాలు

**ముత్తూట్ ఫైనాన్స్‌తో ఒప్పందం**

**ప్రాంతీయ భాషలలో జెమినీ ఏఐ**

**గూగుల్ ఇండియా సదస్సులో వెల్లడి**

న్యూఢిల్లీ: దేశీయంగా కార్యకలాపాలను మరింత విస్తరించనున్నట్లు గ్లోబల్ టెక్నాలజీ దిగ్గజం గూగుల్ తాజాగా పేర్కొంది. దీనిలో భాగంగా మొబైల్ చెల్లింపుల ప్లాట్‌ఫామ్ జీపే బంగారు ఆభరణాలపై రుణాలు అందించనున్నట్లు పేర్కొంది. ఇందుకు ముత్తూట్ ఫైనాన్స్‌తో చేతులు కలిపినట్లు వెల్లడించింది. అంతేకాకుండా ఏఐ అసిస్టెంట్ జెమినీ లైవ్‌ను హిందీ భాషలో ప్రారంభించినట్లు తెలియజేసింది. తదుపరి దశలో మరో 8 ప్రాంతీయ భాషలలో జెమినీ సేవలు లభ్యంకానున్నట్లు వెల్లడించింది. గూగుల్ ఫర్ ఇండియా 10వ సదస్సులో ఇంకా పలు విషయాలను తెలియజేసింది. వీటి ప్రకారం దేశవ్యాప్తంగా ప్రజలు చౌక వడ్డీ రేట్లలో గోల్డ్ లోన్ సౌకర్యాన్ని వినియోగించుకొవచ్చు. ఇందుకు రుణగ్రహీతలకు సౌకర్యవంతమైన అవకాశాలను కల్పిస్తోంది. మరోపక్క రుణదాతలకు సెక్యూరిటీని అందిస్తోంది. కాగా.. ప్రపంచ పసిడిలో ఇండియా వాటా 11 శాతమని గూగుల్ ఇండియా ఎండీ రోమ దత్త చోబే తెలియజేశారు. ఏఐ అసిస్టెంట్ జెమినీ లైవ్ యూజర్లలో 40శాతానికిపైగా వాయిస్ ద్వారానే సేవలను వినియోగించుకుంటున్నట్లు గూగుల్ ఇండియా ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్ సీనియర్ డైరెక్టర్ హేమ బూదరాజు పేర్కొన్నారు. ప్రస్తుతం హిందీ భాషలో జెమినీ లైవ్‌ను ఆవిష్కరించినట్లు తెలియజేశారు.

# హైదరాబాద్‌లో ఇళ్ల అమ్మకాలకు ఏమైంది?

న్యూఢిల్లీ: హైదరాబాద్‌తో పాటు దేశవ్యాప్తంగా ఏడు ప్రముఖ పట్టణాల్లో ఇళ్ల అమ్మకాలు జూలై%-%సెప్టెంబర్ మధ్య కాలంలో 11 శాతం మేర క్షీణించాయి. మొత్తం 1.07 లక్షల యూనిట్ల విక్రయాలు నమోదయ్యాయి. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో విక్రయాలు 1,20,290 యూనిట్లుగా ఉన్నాయి. ఈ వివరాలను రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ అనరాక్ ఓ నివేదిక రూపంలో విడుదల చేసింది.

కొత్త ఆవిష్కరణలు తక్కువగా ఉండడం, అదే సమయంలో ఇళ్ల ధరలు సగటున 23 శాతం పెరగడం అమ్మకాల క్షీణతకు కారణాలుగా పేర్కొంది. ముఖ్యంగా హైదరాబాద్ మార్కెట్లో అమ్మకాలు ఏకంగా 22 శాతం తగ్గి 12,735 యూనిట్లుగా ఉన్నాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో 16,375 యూనిట్లు అమ్ముడుపోవడం గమనార్హం.

**పట్టణాల వారీగా..**

- పుణెలో క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చితే 17 శాతం తక్కువగా 19,050 యూనిట్ల విక్రయాలు నమోదయ్యాయి.
- ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో అమ్మకాలు 15,570 యూనిట్లుగా ఉన్నాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో విక్రయాల కంటే 2% తక్కువ.
- బెంగళూరులో ఇళ్ల విక్రయాలు 8 శాతం క్షీణించి 15,025 యూనిట్లుగా ఉన్నాయి.
- కోల్‌కతా పట్టణంలో 25 తక్కువగా 3,980 యూనిట్ల విక్రయాలు జరిగాయి.
- చెన్నైలో 4,510 యూనిట్ల ఇళ్లు అమ్ముడయ్యాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో విక్రయాలు 4,945 యూనిట్ల కంటే 9% తగ్గాయి.
- హైదరాబాద్‌లో ధరల పెరుగుదల అధికం
- ఏడు ప్రముఖ పట్టణాల్లో హైదరాబాద్‌లోనే ఇళ్ల ధరల పెరుగుదల అధికంగా 32 శాతం మేర నమోదైంది. "నిర్మాణంలోకి వినియోగించే ఉత్పత్తుల ధరలు పెరగడం, అమ్మకాల్లోనూ గణనీయమైన వృద్ధితో.. ఏడు ప్రధాన పట్టణాల్లో ఇళ్ల ధరలు మొత్తం మీద 23 శాతం మేర పెరిగాయి. చదరపు అడుగు ధర రూ.6,800 నుంచి రూ.8,390కు పెరిగింది"అని అనరాక్ నివేదిక తెలిపింది.
- పండుగల కాలంలో డిమాండ్

"అన్ని ప్రముఖ పట్టణాల్లోనూ ఇళ్ల అమ్మకాలు క్షీణించాయి. టాప్%-%7 పట్టణాల్లో నూతన ఇళ్ల యూనిట్ల సరఫరా జూలై%-%సెప్టెంబర్ మధ్య 19 శాతం తగ్గి 93,750 యూనిట్లుగానే ఉంది. క్రితం ఏడాది ఇదే కాలంలో 1,16,220 కొత్త యూనిట్ల సరఫరా నమోదైంది. ఆవిష్కరణల కంటే విక్రయాలు ఎక్కువగా ఉండడం.. డిమాండ్%-%సరఫరా సమీకరణం బలంగా ఉండడాన్ని సూచిస్తోంది"అని అనరాక్ చైర్మన్ అనుజ్‌పురి తెలిపారు. అధిక ధరలకు తోడు, వర్షాకాలం కావడం విక్రయాలు



తగ్గడం వెనుక ఉన్న అంశాలుగా పేర్కొన్నారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.